

ఆర్వోపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

# వైసీపీ శ్రేణుల.. హల్‌చల్






దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్తలు



దాడిలో ధ్వంసమైన కారు అద్దాలు

## నరసరావుపేట ఫెసిలిటేషన్ కేంద్రం వద్ద ఉద్రిక్తత

- పోలీసుల సాక్షిగా టీడీపీ కార్యకర్తలపై వైసీపీ దాడి
- కారు ధ్వంసం.. పలువురికి గాయాలు ఆస్పత్రికి తరలింపు
- భయాందోళనతో ఓటు హక్కు వినియోగించుకోకుండానే వెనుతిరిగిన ఉద్యోగులు
- సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై దాడి

నరసరావుపేట, మే 6: పోలింగ్ సమయం దగ్గరపడుతుంది.. ప్రశాంత ఎన్నికలకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు ప్రకటిస్తున్నారు. స్వేచ్ఛాయుత ఓటింగ్‌కు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు చెప్తున్నారు. కానీ పల్నాడులో మరోసారి వైసీపీ మూకలు బరి తెగించాయి. నరసరావుపేట పల్నాడు రోడ్డులోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు హల్‌చల్ చేశాయి. వైసీపీ మూకలు కేంద్రాన్ని చుట్టుముట్టారు. పోలీసుల సాక్షిగా గంట పాటు కర్రలు.. రాళ్లతో వీరంగం వేశారు. పసుపు కండువ ధరించిన వారిని టార్గెట్ చేసి దాడిచేసి గాయపరిచాయి. భయభ్రాంతులకు గురైన కొందరు ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుతిరగాల్సి వచ్చింది. ఈ సంఘటనలతో పల్నాడు రోడ్డులో ఉద్రికత్త పరిస్థితుల నెలకొన్నాయి. సత్యనారాయణ రెడ్డి అనే విశ్రాంత ఆర్మీ ఉద్యోగి ఎస్ఎస్ఎన్ కళాశాలలోని ఫెసిలిటేషన్ కేంద్రానికి రాగా విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి ఓటు ఉండదని అక్కడి అధికారులు చెప్పారు. ఆ తర్వాత ఆయన కేంద్రం వద్ద పోలీసులతో ముచ్చటిస్తున్నారు. ఆ సమయంలో టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అక్కడకు రాగా ఆయన కారును కేంద్రం లోపలికి అనుమతించలేదు. దీంతో వాదన మొదలుకావడం, అక్కడున్న సత్యనారాయణరెడ్డి మొబైల్ ఫోన్‌పై వైసీపీ స్టిక్కర్‌ను టీడీపీ కార్యకర్తలు గమనించి మందలించి ఆ స్టిక్కర్‌ను తొలగించారు. సత్యనారాయణరెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడి చేశారన్న సమాచారం వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి తెలిసింది. దీంతో ఆయన తన అనుచరులతో కలసి కేంద్రంలోకి ప్రవేశించారు. సత్యనారాయణరెడ్డిపై దాడి జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ఆర్వో సరోజపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కళాశాలకు ఎదురుగా ఉన్న వైసీపీ కార్యాలయం నుంచి కర్రలు, రాళ్లతో వచ్చిన వైసీపీ మూకలు కేంద్రం వద్దకు చేరి టీడీపీ శ్రేణులపై దాడులకు తెగబడ్డాయి. పసుపు కండువా ఉన్న వ్యక్తులే లక్ష్యంగా వారిపై దాడి చేసి గాయపరిచాయి. వైసీపీ మూకల దాడులతో కేంద్రం వద్ద ఓటు వేయడానికి వచ్చిన ఉద్యోగులతో పాటు పల్నాడు రోడ్డులోని సాధారణ ప్రజలు భయకంపితులయ్యారు.

అదే సమయంలో అటు వైపు వెళ్తున్న సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ కారుపై కర్రలతో వైసీపీ మూకలు దాడిచేశాయి. అద్దాలు ధ్వంసం చేసి కారు టైర్లలో గాలితీసేశారు. గంట పాటు ఇష్టం వచ్చినట్లుగా దాడులకు తెగబడుతున్నా అక్కడకు పోలీసులు ప్రేక్షక పాత్రకే పరిమితమయ్యారు. గాయపడిన టీడీపీ కార్యకర్తలను స్థానికులు ఆస్పత్రులకు తరలించారు.

### వైసీపీ కార్యాలయం ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఏర్పాటులో ఎన్నికల అధికారులు నిబంధనలు పాటించలేదు. ఏకంగా వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ కార్యాలయం ఎదురుగానే కేంద్రం ఏర్పాటు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక పార్టీ కార్యాలయం ఎదురు పోస్టల్ బ్యాలెట్ కేంద్రం ఎలా ఏర్పాటు చేశారన్న ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. అక్కడ ఎప్పుడూ వందలాది మంది వైసీపీ కార్యకర్తలు ఉంటారు. పార్టీ కార్యాలయం గేటు ఎదురుగానే బ్యాలెట్ కేంద్రం గేటు ఉంది. సదరు కార్యాలయంలో కర్రలు, రాళ్లు ఎందుకు ఉన్నాయి. ఇప్పటికైనా పోస్టల్ బ్యాలెట్ కేంద్రం మార్చాలని ఉద్యోగులు కోరుతున్నారు. లేకుంటే భారీగా భద్రత కల్పించాలంటున్నారు.

### ఇప్పుడే ఇలా.. పోలింగ్ రోజు పరిస్థితి?

పోస్టల్ బ్యాలెట్ కేంద్రం వద్ద ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో యంత్రాంగం విఫలమైందనేందుకు సోమవారం నరసరావుపేటలో జరిగిన ఘటనే నిదర్శనం. ఓటు గుర్తింపు స్లిప్ ఉన్నవారిని, అభ్యర్థులు, వారి ఏజెంట్లను మాత్రమే కేంద్రంలోకి అనుమతించాల్సి ఉండగా ఇందుకు విరుద్ధంగా అధికారులు వ్యవహరించినందునే ఈ ఘర్షణ చోటు చేసుకుందన్న విమర్శలు వస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహణలో యంత్రాంగం, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించినందునే వైసీపీ మూకలు దాడులకు తెగబడ్డాయన్న విమర్శలున్నాయి. పరిమిత ఓటర్లు ఉండే ఈ పోస్టల్ పోలింగే ఇలా నిర్వహిస్తే 13న జరిగే అసలు పోలింగ్ పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయాందోళనలు ఓటర్ల నుంచి వ్యక్తమవుతున్నాయి. పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఇదేరకమైన దాడులకు తెగబడేందుకు వైసీపీ రంగం సిద్ధం చేసుకుంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ ఎలాంటి చర్యలు తీసుకుని ప్రశాంత ఎన్నికలు నిర్వహిస్తుందో చూడాలి.



పల్నాడు రోడ్డులో కర్రలతో వైసీపీ కార్యకర్తల వీరంగం

### అరాచకాలపై ఖండన

- శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు

ఓటమి భయంతోనే ఓటర్లను ఇబ్బంది పెట్టే అరాచక చర్యలకు వైసీపీ నేతలు పాల్పడుతున్నారని కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు తెలిపారు. నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగస్తులు టీడీపీ వైపే ఉండడంతో వైసీపీ నేతల్లో భయం మొదలై ప్రశాంతంగా జరుగుతున్న బ్యాలెట్ ఓటింగ్ వద్ద అలజడి సృష్టించారన్నారు. ఇలాంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎస్ఎస్ఎన్ కళాశాలలోని పోస్టల్ బ్యాలెట్ కేంద్రంలోకి నిబంధనలకు విరుద్ధంగా వైసీపీ మూకలు ప్రవేశించి లోపలే సమావేశాలు పెట్టారన్నారు. దాదాపు 30 మందికి పైగా వైసీపీకి చెందిన వ్యక్తులు ఎన్నికల కాంపౌండ్ లోపలికి ప్రవేశించారన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఆయన అనుచరులు టీడీపీ శ్రేణులపై దాడి చేయ డాన్ని ప్రజలు గమనించార న్నారు. ఈ ఘటనపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు. సమావేశంలో జనసేన నేత సయ్యద్ జిలానీ పాల్గొన్నారు.



# కూటమిదే జోరు

- మార్పు కోరుకుంటున్న జిల్లావాసులు
- శ్రీకృష్ణదేవరాయలుకు పెరుగుతున్న ప్రజామద్దతు
- అక్రమాలు, అరాచకాలతో వైసీపీ అభ్యర్థులపై వ్యతిరేకత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గం దేశంలోనే అత్యంత సమస్యాత్మకమైనది. ఇక్కడ కండ బలం, ధన బలం ఉన్న వారిదే పై చేయి. ఈ ఎన్నికల్లో ధనంతో పాటు కులం కీలక పాత్ర పోషిస్తున్నది. జిల్లా వాసులు మార్పు కోరుకుంటున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. జనసేన పొత్తుతో టీడీపీ కూటమి అభ్యర్థుల్లో గెలుపు ధీమా కనిపిస్తోంది. అసెంబ్లీ అభ్యర్థుల సమన్వయంతో అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. 2019 ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ పరిధిలో వైసీపీ జెండా రెపరెపలాడింది. అయితే ఐదేళ్ల వైసీపీ పాలనతో అధికార పార్టీపై వ్యతిరేకత, స్థానిక ఎమ్మెల్యేలపై అసంతృప్తి ఉంది. నియోజక వర్గాల్లో అభివృద్ధి లేకపోవడం, అధ్వానమైన రహదారులు అధికార పార్టీపై వ్యతిరేకత, ఎమ్మెల్యేలపై అవినీతి, అరాచకాలు ఎన్నికల్లో ప్రభావం చూపనున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లాలో ఈసారి పరిస్థితి మారనుంది. సత్తెనపల్లిలో ఏ పార్టీ గెలుస్తుందో ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తుందనే సెంటిమెంట్ ఉంది.

### లోక్‌సభ స్థానంలో ఫలించని బీసీ కార్డు

లోక్‌సభ స్థానంలో లావు శ్రీకృష్ణదేవరాయలు విజయకేతనం ఎగురవేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వైసీపీ బీసీ కార్డు ప్రయోగించడంతో పోరు పోటాపోటీగా ఉంటుందని తొలుత భావించారు. అయితే రోజురోజుకు కూటమి అభ్యర్థికి ప్రజల మద్దతు పెరుగుతోంది, వైసీపీ తరఫున నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌ను రాజకీయ బదిలీపై నరసరావుపేట లోక్‌సభలో పోటీ పెట్టారు. వైసీపీ అభ్యర్థిగా గత ఎన్నికల్లో లావు రికార్డు స్థాయి మెజారిటీతో ఇదే స్థానం నుంచి గెలుపొందారు. ఈసారి ఎన్నికల్లో ఆయన టీడీపీ తరఫున పోటీలోకి దిగారు. ఎంపీగా గతంలో నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ప్రజలు గుర్తించారు. ఇది లావుకు కలసివచ్చే అంశంగా ఉంది. గతంలో వైసీపీకి ఓటు వేసిన వారు ఈసారి లావు వైపు మొగ్గుచుపుతున్నారు. తాను గెలిస్తే చేసే అభివృద్ధి ప్రణాళికను ప్రజలు నమ్ముతున్నారు. గెలిచిన ఏడాదిలోనే వరికపూడిశెల పథకం పూర్తిచేస్తానని ప్రకటించారు. సాగర్ కాలువకు గోదావరి జలాల తరలింపు పథకాన్ని పూర్తి చేస్తానని హామీ ఇస్తున్నారు. లోక్‌సభ పరిధిలో మెజారిటీ అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిచే పరిస్థితి ఉండటం లావుకు కలసిరానున్నది.

### సత్తెనపల్లిలో.. కన్నా గెలుపు ఖాయం


సత్తెనపల్లిలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గెలుపు ఖాయంగా కనిపిస్తోంది. మంత్రి, వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబుపై ఉన్న వ్యతిరేకత కన్నాకు కలసి రానుంది. 2019 ఎన్నికలతో పోలిస్తే అంబటికి ప్రతికూల వాతావరణం స్పష్టంగా కన్పిస్తోంది. కన్నా, అంబటి ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన నేతలే. కానీ ఆ వర్గం కన్నా వైపు మొగ్గుచూపుతోంది. సత్తెనపల్లి మున్సిపాల్టీలో ఇబ్బందులు ఎదుర్కొన్న ఆర్యవైశ్య సామాజిక వర్గం వైసీపీకి దూరమైంది. అవినీతి, అక్రమాలు, స్వలాభం, నోటి దురుసు నేతలతో వివిధ వర్గాలతో పాటు సొంత పార్టీ నేతలు కూడా అంబటికి దూరమయ్యారు. జలవనరుల మంత్రిగా సాగర్ కాల్వలకు కనీస మరమ్మతులు కూడా చేయలేకపోవడంతో రైతులు ఆయన్ను వ్యతిరేకిస్తున్నారు. కన్నా దాదాపు ఏడాదిగా నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పర్యటించారు. కాపు సామాజిక వర్గం మద్దతు కూడగట్టడంలో, అంబటిని వ్యతిరేకిస్తున్న వారిని టీడీపీలో చేర్చుకోవడంలో కన్నా సక్సెస్ అయ్యారు. మంత్రిగా ప్రజలకు ఆయన అందించిన సేవలు కలిసి రానున్నాయి.

### మాచర్లలో.. మార్పు ఖాయం

పౌరుషాల గడ్డ పల్నాట రాజకీయ పోరు రసవత్తరంగా మారింది. ఐదో సారి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బరిలో నిలిచారు. టీడీపీ అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి పోటీతో ఫ్యాన్ పార్టీలో ఉక్కపోత నెలకొంది. పిన్నెల్లిని ఢీకొనడంలో జూలకంటి ముందున్నారు. రోజు రోజుకు జూలకంటి అనుకూల వాతావరణం పెరుగుతోంది. ఇద్దరూ ఒకే సామాజిక వర్గానికి చెందిన వారైనా ఆ సామాజికవర్గం మద్దతు జూలకంటికి ఎక్కువగా ఉంది. వరుస విజయాలు అందుకున్న పిన్నెల్లి ఈ సారి ఓటర్ల నుంచి తీవ్ర అసంతృప్తి ఎదుర్కొంటున్నారు. షాడో ఎమ్మెల్యేగా వ్యవహరించిన సోదరుడు వెంకట్రామిరెడ్డి అరాచకాలు రామకృష్ణారెడ్డికి తీవ్ర వ్యతిరేకత తెచ్చిపెట్టాయి. టీడీపీ నేతల హత్యలు, దాడులతో ప్రజలు రాక్షస పాలన నుంచి విముక్తి కోరుకుంటున్నారు. ప్రశాంత వాతావరణం కోరుకుంటున్న ఓటర్లు బ్రహ్మారెడ్డికి బాసటగా నిలుస్తున్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని పోలింగ్ రోజును అరాచకాలు సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు వైసీపీ వ్యూహరచన చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. దీనిని సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ప్రజలు జూలకంటికి మద్దతు తెలియజేస్తున్నారు. పదవి కాదు ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడం ముఖ్యమని, బానిస సంకెళ్ల నుంచి విముక్తి కల్పించడమే లక్ష్యమని జూలకంటి మాటలను విశ్వసిస్తూ ఆయనకు సంపూర్ణ మద్దతు తెలియజేసేందుకు సిద్ధమవుతున్నారని తెలుస్తోంది.

### చిలకలూరిపేటలో గెలుపు ఏకపక్షమే

చిలకలూరిపేటలో టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు [illegible] ఏకపక్షమే.




గత ఎన్నికల్లో ఓడిన ఆయనపై సానుభూతి ఉంది. టీడీపీ సంస్థాగతంగా బలంగా ఉండటం. జనసేన ఓటింగ్ కలసి ఈసారి ప్రత్తిపాటికి ఘనవిజయం సాధించి పెట్టనున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే రజినిని కాదని మల్లెల రాజేష్‌నాయుడును తొలుత వైసీపీ అభ్యర్థిగా ప్రకటించింది. చివరకు గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడ్ని బరిలో దింపింది. దీంతో రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో బలమైన వైసీపీ క్యాడర్ టీడీపీలో చేరింది. పార్టీలోని ప్రధాన సామాజిక వర్గం కావటి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఎన్నికల కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. అంతర్గత పోరుతో కావటి ఒంటరి కాగా ప్రత్తిపాటి విజయం దిశగా దూసుకుపోతున్నారు.

### పెదకూరపాడు ప్రవీణ్‌దే

పెదకూరపాడు నుంచి వైసీపీ తరఫున సిట్టింగ్ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పోటీ చేస్తున్నారు. ఐదేళ్ల ఆయన సాగించిన దౌర్జన్యాలు, ఇసుక దందాలతో ఆయన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్నారు. శాండ్ శంకర్‌రావుగా ఆయన్ను ప్రజలు విమర్శిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వైకుంఠపురం కొండను తొలచి గ్రావెల్‌ను విక్రయించారు. రోడ్లు, ఎత్తిపోతల పథకాలపై ఆయనిచ్చిన హామీల అమలులో విఫలమవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. సొంత పార్టీలోనూ ఆయనపై వ్యతిరేకత అధికమైంది. టీడీపీ ఇక్కడ అభ్యర్థిని మార్చి భాష్యం ప్రవీణ్‌ను బరిలో దింపింది. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కూడా ప్రవీణ్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు. కొత్త అభ్యర్థి అయినా ఆయన వెంట వెంట నడుస్తోంది. నంబూరును వ్యతిరేకిస్తూ పార్టీలోని ముఖ్య నేతలు ఆపార్టీని వీడారు. ప్రవీణ్‌కు ప్రజలు పట్టం కట్టనున్నారు.

### గురజాలలో గెలుపు యరపతినేనిదే..

గురజాలలో టీడీపీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు, వైసీపీ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి మధ్య పోరు ఆశక్తిగా సాగుతోంది. ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటామని ఇద్దరూ పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. అంటే ఇక్కడ పోరు ఏ స్థాయిలో జరుగుతుంతో వారి సవాళ్లు తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో యరపతినేని విజయం కోసం టీడీపీ క్యాడర్ కసిగా శ్రమిస్తోంది. జనసేన పొత్తు యరపతినేనికి కలిసి రానున్నది. గత ఎన్నికల్లో యరపతినేనికి ప్రత్యర్థిగా ఉన్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తన అనుచరులతో కలసి టీడీపీలో చేరారు. ఆయన కాసును ఓడించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారు. దూరంగా ఉన్న వర్గం కూడా ప్రస్తుతం యరపతినేని గెలుపు కోసం కృషి చేస్తోంది. యరపతినేని ఎమ్మెల్యేగా గురజాలకు చేసిన అభివృద్ధి ఆయనకు కలసిరానున్నది. ఎవరికి ఏ అవసరం వచ్చినా స్పందిస్తారనే గుర్తింపు యరపతినేనికి ఉంది. అరాచకాలను కాసు ప్రోత్సహించారు. ప్రత్యర్థులపై దాడులు చేయించారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఊళ్లకు ఊళ్లు ఖాళీచేసి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన దారుణ పరిస్థితికి కాసే కారణమని ప్రజల్లో బలంగా ఉంది. క్వారీల నుంచి అక్రమ వసూళ్లు, చెక్‌పోస్టు ద్వారా ఆదాయం వంటి ఆరోపణలను మహేష్ ఎదుర్కొంటున్నారు. ఎత్తిపోతల పథకాలపై ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవడంతో రైతులు వ్యతిరేకంగా ఉన్నారు. ఈ పరిణామాలు యరపతినేని గెలుపునకు బాటలుగా మారనున్నాయి.

### వినుకొండలో జీవీ గాలి

వినుకొండలో టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సిట్టింగ్ ఎమ్మెల్యే, వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మానాయుడు తలపడుతున్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీలో చేరి బొల్లా ఓటమికి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా, శివశక్తి ఫౌండేషన్ ద్వారా చేసిన కార్యక్రమాలు జీవీ విజయానికి దోహదం కానున్నాయి. జనసేన, బీజేపీ, టీడీపీ కార్యకర్తలు కలసికట్టుగా పనిచేస్తుండటం జీవీకి ప్లస్‌గా మారనున్నది. గతంలో వైసీపీకి ఓటేసిన వారు సైతం ఆంజనేయులు వైపు మొగ్గుచూపుతున్నారు. జీవీ ఇప్పటికే అధిక శాతం గ్రామాల్లో పర్యటించి ఓటర్ల నుంచి మద్దతు కూడగడుతున్నారు. బొల్లా, సీఎం జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించడంతో ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. మార్పు కోరుకుంటున్న ప్రజలు జీవీ వైపు మొగ్గుచూపుతున్నారు.

### సమష్టిగా పోరాడితే నరసరావుపేట కూటమిదే..

రాజకీయాలకు ఖిల్లా నరసరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. వైసీపీ కంచుకోటలో టీడీపీ పాగా వేసేందుకు తహతహలాడుతోంది. టీడీపీ కూటమి అభ్యర్థిగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు, సిట్టింగ్ ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పోటీలో ఉన్నారు. గోపిరెడ్డి ఇంటి పోరును ఎదుర్కొంటున్నారు. నేతలు గత ఎన్నికల్లో వలే ఆయనకు పూర్తిస్థాయిలో పని చేయడంలేదని ఆ పార్టీ వర్గాలే ప్రచారం చేస్తున్నాయి. అవినీతి, అక్రమాలు, అక్రమ కేసుల వంటి ఆరోపణలను శ్రీనివాసరెడ్డి ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఆయన విఫలమయ్యారన్న విమర్శలున్నాయి. బీసీ వర్గానికి చెందిన అరవిందబాబు కు టీడీపీ టిక్కెట్ కేటాయించడంతో ఆ వర్గం ఓటర్లు ఆయన వైపు మొగ్గుచూపుతున్నారు. జనసేన పొత్తు కారణంగా కాపు వర్గం కూటమి విజయం కోసం పనిచేస్తోంది. వివిధ సామాజిక వర్గాలు వైసీపీ వ్యతిరేకిస్తూ టీడీపీ కూటమికి మద్దతు తెలియజేస్తున్నాయి. వైసీపీకి చెందిన కీలక నేతలను తమ వైపు తిప్పుకోవడంలో టీడీపీ నేతలు సఫలమవుతున్నారు. పట్టణ ఓటర్ల నుంచి కూటమికి సానుకూలత వ్యక్తమవుతోంది. సమష్టిగా పోరాడితే విజయం కూటమినే వరించే అవకాశాలున్నాయి.

# పోస్టల్ బ్యాలెట్‌కు.. పైసలు

ఉద్యోగుల ఓట్లకు యమ డిమాండ్

- కొనుగోళ్లలో అధికార వైసీపీ అభ్యర్థులు
- రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఆఫర్
- ఐదేళ్లుగా జరిగిన అన్యాయంపై నేతలను నిలదీస్తున్న ఉద్యోగులు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్‌కు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పటికే పీవో, ఏపీవో, మైక్రో అబ్జర్వర్లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. అయితే వీరి సంఖ్య తక్కువ గానే ఉన్నది. ఎన్నికల విధుల్లో అత్యధిక సంఖ్యలో ఉండే పోలీసులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్య శాఖ, సచివాలయాల సిబ్బందితో పాటు కాంట్రాక్టు ఉద్యోగులకు మంగళ, బుధవారాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగించేందుకు అవకాశం ఇచ్చారు. నియోజకవర్గాల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు బారులు తీరారు. ఉద్యోగుల్లో ఎక్కువమంది ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న దృష్ట్యా వీరి ఓట్లపై వైసీపీ అభ్యర్థులు దృష్టి పెట్టారు. ఎలాగైనా ఉద్యోగులను ప్రసన్నం చేసుకుని వారి ఓటును తమకు అనుకూలంగా వేయించుకునేందుకు డబ్బు రూపంలో ప్రలోభ పెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఆ రేటు రూ.2 వేల నుంచి రూ.7 వేల వరకు ఇచ్చేందుకు అభ్యర్థులు ముందుకు వచ్చారంటే పోస్టల్ బ్యాలెట్‌కు ఏ స్థాయిలో డిమాండ్ ఉందో తెలుస్తోంది. ఉద్యోగులను అనుకూలం చేసుకునేందుకు మరికొందరు ఉద్యోగ సంఘ నేతలను సంప్రదించి బేరసారాలకు తెరలేపారు. ఉద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నారనే అంచనాల నేపథ్యంలో వారికి ఓటుకు రూ.5,000 చెల్లించాలని తాడేపల్లి పెద్దలు అభ్యర్థులకు ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. నేతల అనుచరులు పోస్టల్ బ్యాలెట్ కేంద్రాల దగ్గరే మకాం వేసి ఉద్యోగులను ప్రలోభపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రలోభాలపై టీడీపీ నేతలు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంపై విమర్శలకు తావిస్తోంది. మరోవైపు గంపగుత్తగా ఉద్యోగుల ఓట్ల కొనుగోలుకు యూనియన్ నేతల ద్వారా వైసీపీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే యూనియన్ నేతలతో పాటు, పలువురు ఉద్యోగుల నుంచి బేరసారాలపై తిరస్కారమే ఎదురవుతుంది. ఐదేళ్లుగా వైసీపీ పాలనలో తమకు జరిగిన అన్యాయంపై నేతలను ఉద్యోగులు నిలదీయడం మొదలుపెట్టారు. తమ ప్రయోజనాలకు ప్రభుత్వం గండికొట్టి ఇప్పుడొచ్చి డబ్బు ఆశచూపితే మోసపోవడానికి తాము సిద్ధంగా లేమని తిరస్కరిస్తున్నారు. దీంతో వైసీపీ అభ్యర్థులు, నేతల్లో కలవరం మొదలైంది.

- పల్నాడు జిల్లాలో 19,095 మంది ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్‌లు జారీ చేశారు. వీరిలో 16,582 మంది జిల్లాలో విధులు నిర్వహిస్తూ జిల్లాలోనే ఓటు హక్కు కలిగినవారు ఉన్నారు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్ అత్యధికంగా పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.7 వేలకు వైసీపీ అభ్యర్థి నంబూరు శంకరరావు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తదుపరి మాచర్లలో రూ.5 వేలకు పిన్నెల్లి కొనుగోలు చేసినట్లు సమాచారం. ఇతర నియోజకవర్గాల్లో కనీసం రూ.3 వేలకు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# వైసీపీ నేతల బరితెగింపు

- ఎన్నికల కోడ్ ఉల్లంఘన ● రహదారి నిర్మాణానికి మట్టితరలింపు



దాచేపల్లి 1వ వార్డులో రహదారి నిర్మాణానికి తోలిన మట్టి

దాచేపల్లి, మే 6: దాచేపల్లిలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతోంది. రహదారి నిర్మాణంకోసం ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. పోలీసు, నగరపంచాయతీ కమిషనర్, స్పెషల్ స్క్వాడ్ బృందాలకు ఫోన్‌చేసి సమాచారం ఇచ్చినా ఎటువంటి సమాధానం ఇవ్వలేదని టీడీపీ నేతలు ఆరోపించారు. వివరాల్లోకి వెళ్తే దాచేపల్లి నగర పంచాయతీలోని 1వ వార్డు పరిధిలో దూదేకుల వారి బజారులో రహదారి నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలించి రోడ్డుపై పోసి చదునుచేస్తున్నారు. దీనికితోడు 1,2,3 వార్డుల్లో పనిచేస్తున్న కొంతమంది వలంటీర్లు ఇంటింటికి తిరిగి వైసీపీ వస్తేనే ప్రభుత్వ పథకాలు కొనసాగుతాయని, టీడీపీ వస్తే పథకాలు నడవవని ప్రజలను మభ్యపెడుతున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ఇదే విషయంపై స్థానిక టీడీపీ నేతలు వలంటీర్లను ప్రశ్నిస్తే తాము రాజీనామా చేశామంటూ దురుసుగా సమాధానం చెబుతున్నారు. ఎవరు రాజీనామా చేశారో లిస్టు కావాలని ఎంపీడీఓను వివరాలు అడిగితే ఆ వివరాలు కూడా మాకు చెప్పడం లేదని టీడీపీ నేతలు పేర్కొన్నారు. వైసీపీ నేతలకు ఒక నీతి, టీడీపీ నేతలకు మరొక నీతిగా మారిందని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి.

## జగన్‌ను ఇంటికి పంపేందుకు మాదిగలు సిద్ధం

- ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులన్నీ దారి మళ్లించారు
- ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్

దాచేపల్లి, మే 6: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ఇంటికి పంపించేందుకు మాదిగలంతా సిద్ధంగా వున్నారని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రుద్రపోగు సురేష్ తెలిపారు. సోమవారం దాచేపల్లిలోని టీడీపీ కార్యాలయంలో సురేష్ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అరాచకత్వం, అక్రమాలు మినహా అభివృద్ధి జాడేలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులన్నీ దారి మళ్లించారని ఆరోపించారు. మాదిగలకు ఎస్సీ వర్గీకరణ ముఖ్యమని, దీనికి జగన్మోహన్‌రెడ్డి వ్యతిరేకమని తెలిపారు. ఇంటింటికి తాగునీటి పైపులు ఇస్తామన్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వేసవిలో గుక్కెడు నీరు లభించక దళిత బిడ్డలు ఇబ్బంది పడుతుంటే ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించడం కూడా కష్టంగా వుందని ఫిర్యాదు చేశారు. రానున్న ఎన్నికలలో మాదిగలంతా సంఘటితమై వైసీపీని ఓడించాలని, టీడీపీని గెలిపించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాతంగి సత్యానందం, బాబు మాదిగ, కోటేశ్వరి, చిలుముల దుర్గారావు, సుందరరావు, వేల్పుల ముత్తయ్య, పత్రా విజయ్ పాల్గొన్నారు.

## మద్యం, నగదు సీజ్

గుంటూరు(తూర్పు), మే6: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా మంగళగిరి, తెనాలి, తాడికొండ నియోజకవర్గ పరిధిల్లో రూ.3,05,400, రూ.1,00,000 నగదు, గుంటూరు తూర్పులో రూ.34,110 నగదు, రూ.7,480 విలువగల 10.7 లీటర్ల మద్యం సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. మే 6వ తేది సాయంత్రం 6 గంటల వరకు రూ.3,17,17,881 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

# రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని ఆశీర్వదించండి

- ఐదేళ్లు అండగా నిలబడతాం
- శ్రీకృష్ణదేవరాయలు, అరవింద్ బాబు

నరసరావుపేటరూరల్, మే6: రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎన్డీఏ కూటమి అభ్యర్థులుగా పోటీ చేస్తున్న తమని ఆశీర్వదిస్తే ఐదేళ్లు అండగా నిలబడతామని నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. సోమవారం నరసరావుపేటరూరల్ మండలంలోని.. రావిపాడు, అల్లూరివారిపాలెం, అరవపల్లి, పెట్లూరివారిపాలెం, కాకాని, కోటప్పకొండ, యక్కలవారిపాలెం, గోనెపూడి, చింతలపల్లి, యలమంద గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రేపు జరగబోయే మంచిని మాత్రమే గుర్తుంచుకోవాలని, ఎటువంటి ప్రలోభాలకు లొంగొద్దని, భయభ్రాంతులకు గురవద్దని కోరారు. పల్నాడులో రైతులకు మేలు జరగాలంటే గోదావరి జలాలను సాగర్ కుడికాల్వకు తెచ్చుకోవాలని, ఈ ప్రాజెక్టుకు ఇప్పటికే చంద్రబాబునాయుడు శంకుస్థాపన కూడా చేశారని అన్నారు. జల్‌జీవన్‌మిషన్ ద్వారా ప్రతి ఇంటికి నీరు అందించేందుకు పల్నాడుకి రూ.500 కోట్లు మంజూరు అయ్యాయని, తాము అధికారంలోకి రాగానే.. నిధులు సమర్థంగా వినియోగించుకొని ప్రతి



రావిపాడు ఎన్నికల ప్రచారంలో లావు శ్రీకృష్ణ దేవరాయలు, అరవిందబాబు



బీసీల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న లావు శ్రీకృష్ణ దేవరాయలు

ఇంటికి కుళాయి ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదవాని జీవన దశ దిశ మార్చబోతున్నామని అన్నారు.

**బీసీలను ఆర్థికంగా, సామాజికంగా ముందుకు తీసుకెళ్తాం..**

బీసీ సామాజికవర్గానికి గడిచిన ఐదేళ్లలో పదవులు అలంకారానికేతప్ప, అధికారాలు శూన్యమని కూటమి నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవింద బాబు, జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని అన్నారు. సోమవారం నరసరావుపేట మండలం, రావిపాడు గ్రామంలో యాదవుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ బీసీల పార్టీ అని, గడిచిన కాలంలో వారి సంక్షేమాన్ని కృషిచేసింది టీడీపీయేనని అన్నారు. బీసీ కార్పొరేషన్లకు పూర్వ వైభవం తీసుకొస్తామని, నిధులు కేటాయించి, వారికి సముచిత గౌరవాలు కల్పిస్తామని అన్నారు. బీసీ డిక్లరేషన్ రక్షణ చట్టంతో వారికి కవచంలా పనిచేస్తామని అన్నారు. గడిచినకాలంలో పల్నాడులో బీసీలపై దాడులు జరిగాయని, చంద్రయ్యను అమానుషంగా హత్యచేసిన ఘటనలు చూసామని.. ఇలాంటి పరిస్థితులను మార్చి ప్రశాంత వాతావరణాన్ని తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

## మా ఓటు ఎక్కడ?

- గందరగోళంలో పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు
- బ్యాలెట్ పంపలేదంటూ సొంత నియోజకవర్గంలోనే వేయాలని ఆర్వో వెల్లడి

పెదకూరపాడు, మే 6: పెదకూరపాడులో సోమవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ జరిగింది. సుమారు 50 నుంచి 70 మంది ఓటర్లు ఓటు వేయకుండానే వెనుదిరిగి వెళ్ళారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఉద్యోగాలు చేస్తూ వివిధ జిల్లాలకు చెందిన వారికి పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్లో ఓటు వేసేందుకు అవకాశం ఉందని తొలుత సంబంధిత అధికారులు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి మండు వేసవిలో ఓట్లు వేసేందుకు గంటల తరబడి బారులు తీరి ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఫారాలు పూర్తి చేసి బ్యాలెట్ తీసుకోబోయే సమయానికి మీ ఓటు ఉన్న నియోజవర్గం నుంచి రిటర్నింగ్ అధికారి మీ బ్యాలెట్ పంపించలేదని, మీకు ఓటు ఉన్న నియోజక వర్గం వెళ్ళి ఓటు వేసుకోవాలని



ఓటు వేసేందుకు వచ్చిన పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు

సంబంధిత అధికారులు చెప్పారు. 5వతేదీ కొంత మంది ఓటర్లు గుంటూరు, మంగళగిరి తదితర ప్రాంతాల్లో ఓట్లు వేసేందుకు క్యూలో గంటల తరబడి ఉండి తీరా ఓటు వేసే సమయానికి ఇక్కడ కాదు మీరు ఓట్లు వేసేది మీరు ఉద్యోగంచేసే చోటే వేయాలని చెప్పటంతో సోమవారం పెదకూరపాడు వచ్చినట్టు పలువురు ఆంధ్రజ్యోతికి తమ బాధను వెలుబుచ్చారు. ఈ ఓటర్లలో గర్భిణిలు కూడా ఉన్నారు. వారి ఓటు సొంత నియోజక వర్గంలోనా లేక ఉద్యోగం చేసే పెదకూరపాడు నియోజక వర్గంలోనా అనే విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

## 232 మంది హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



యాత్రికుడికి వ్యాక్సిన్ వేస్తున్న సిబ్బంది

గుంటూరు (మెడికల్), మే 6: గుంటూరు, బాపట్ల జిల్లాల నుంచి హజ్ యాత్రకు వెళుతున్న 232 మంది ముస్లిం యాత్రికులకు సోమవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి శుశ్రుతహాల్‌లో ప్రత్యేక వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ శిబిరాన్ని సందర్శించి వ్యాక్సినేషన్ నిర్వహణలో వైద్య సిబ్బందికి తగిన సూచనలు చేశారు. గుంటూరు, బాపట్ల జిల్లాల వ్యాధి నిరోధక టీకాల అధికారులు డాక్టర్ కేవీ సుబ్బరాజు, డాక్టర్ టీ వెంకటేశ్వర్లు శిబిరాన్ని పర్యవేక్షించారు.



సమావేశంలో బీసీ నేతలతో కలసి ఐక్యత చాటుతున్న కేశన శంకరరావు

## వైసీపీ పాలనలో బీసీలపై పెరిగిన దాడులు

- కూటమి అభ్యర్థుల విజయానికి బీసీ సంఘాలు కృషి

పొన్నూరుటౌన్, మే6: వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో బీసీలపై దాడులు, దౌర్జన్యాలు, విచ్చలవిడిగా పెరిగాయని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు ఆరోపించారు. సోమవారం చింతలపూడి డీవీసీ కళ్యాణ మండపంలో బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. బీసీ సంఘాలు కూటమి అభ్యర్థుల విజయానికి పాటుపడాలని సమావేశంలో తీర్మానించారు. అనంతరం జరిగిన సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ ఎన్నికలో జగన్‌మోహన్‌రెడ్డిని ఓడించి బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పెమ్మసాని చంద్రశేఖర్‌ల విజయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాలపై దాడులు దౌర్జన్యాలు పెరిగాయన్నారు. చెరుకుపల్లి వద్ద అమర్నాద్ గౌడ్ అనే బాలుడు, పల్నాడులో చంద్రయ్య హత్యలు అత్యంత కిరాతకమని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘాల యువత అధ్యక్షుడు కె.క్రాంతి కుమార్, అన్నం నాగమల్లేశ్వరరావు, బొర్రు రామారావు, తోట నాగరాజు, షేక్ షఫ్రూద్, బొర్రు సాంబశివరావు తదితర బీసీ నేతలు పాల్గొన్నారు.

## భార్యను రోకలిబండతో కొట్టి చంపిన భర్త

పెదకాకాని, మే6: భార్యను రోకలిబండతో కొట్టి హతమార్చిన ఘటన మండలంలోని తక్కెళ్ళపాడు ఎస్సీ కాలనీలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన పెనుమాల ఏడుకొండలు, అంజమ్మ (45) భార్యాభర్తలు. వీరికి ఇద్దరు పిల్లలు. ఏడుకొండలు కొద్దికాలంగా భార్య ప్రవర్తనపై అనుమానంగా ఉంటూ గొడవపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం భార్యాభర్తల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో ఏడుకొండలు రోకలి బండతో అంజమ్మ తలపై కొట్టాడు. తీవ్ర రక్తస్రావమైన ఆమె అక్కడ పడిపోయింది. కొద్ది సమయానికి తన కొడుకు విజయ్ ప్రకాష్ వచ్చి గమనించగా తల్లిని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఏడుకొండలు పోలీస్ స్టేషన్‌కి వెళ్లి లొంగి పోయినట్లు తెలిసింది.

## దాడులతో భయపడబోం..

- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు బ్రహ్మారెడ్డి పరామర్శ



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, మే 6: పిన్నెల్లి సోదరులు మాచర్ల పట్టణంలో రౌడీమూకలను ఉసిగొల్పి టీడీపీ నేతలపై దాడులు చేయిస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం రాత్రి వైసీపీ రౌడీమూకల దాడిలో గాయపడి ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాజీ కౌన్సిలర్ మంజుల వెంకటేశ్వర్లు కుమారుడు కేశవను ఆయన పరామర్శించారు. ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌ను జరగకుండా అడ్డుకోవాలనేది వారి వ్యూహమన్నారు. ప్రజలంతా వారి దుర్మార్గానికి వ్యతిరేకంగా ఓట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ముందస్తు వ్యూహంలో భాగంగా పోలింగ్ శాతం తగ్గించేందుకు వైసీపీ నేతలు కుట్రలు పన్నుతూ వరుస దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఎన్ని ఆటంకాలు సృష్టించినా ప్రజలు కచ్చితంగా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి ఈ దుర్మార్గాలకు చరమగీతం పాడతారన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ల మధుబాబు మాట్లాడుతూ దాడులకు వెరసేది లేదని, నమ్ముకున్న వారి కోసం తాము అండగా ఉంటామని అన్నారు. పరామర్శించిన వారిలో జూలకంటి శ్రీనివాసరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, బండారు నాగేశ్వరరావు, బండ్ల శ్రీను, కొమెర శివ, జల్లెల కొండలు తదితరులు ఉన్నారు.

## ఐదుకోట్ల మంది ఆత్మగౌరవం అమరావతి

- 1602వ రోజుకు రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 6: ఎడారి, శ్మశానం, ముంపు అంటూ వైసీపీ పాలకులు రాష్ట్ర రాజధాని అమరావతిపైన విషం చిమ్మారని అటువంటి పార్టీ ఓటు వేయవద్దని రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు రాష్ట్ర ప్రజలను వేడుకున్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1602వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు, మహిళలు మాట్లాడారు. ఐదుకోట్ల మంది ఆంధ్రుల ఆత్మ గౌరవమే అమరావతి అని స్పష్టం చేశారు. వైసీపీని శాశ్వతంగా ఇంటికి పంపితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి రాజధాని గ్రామాల్లో నినాదాలు చేశారు.

### నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.60 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

### బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 150, 159,170 |
| చికెన్ విత్ స్కిన్ | 286.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 296.00 |



### మద్యం కేసుల వివరాలు..
## మా ఇష్టం వచ్చినపుడు చెబుతాం

- సమాచారం అడిగినందుకు విలేకరులపై సెబ్ సీఐ దురుసు ప్రవర్తన



విలేకరులపై దురుసుగా ప్రవర్తిస్తున్న సెబ్ సీఐ వెంకటరమణ, ఎస్‌ఐ రవికుమార్

గురజాలటౌన్, మే 6: సెబ్ స్టేషన్ గురజాల పరిధిలో ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం అమ్ముతూ లేదా పంపిణీ చేస్తూ పట్టుబడుతున్న కేసుల వివరాలు మీడియాకు ఎందుకు తెలపడం లేదని సోమవారం గురజాల సెబ్ సీఐ వెంకటరమణను విలేకరులు ప్రశ్నించారు. తమకు వచ్చినప్పుడు లేదా కుదిరినప్పుడు సమాచారం ఇస్తామంటూ సీఐ వెంకటరమణ విరుచుకుపడ్డారు. మీడియాకు చెప్పేంత సమయం లేదు.. సమయం వచ్చినప్పుడు చెబుతాం అంటూ ఆగ్రహించారు. అక్కడే ఉన్న ఎస్‌ఐ రవికుమార్ కూడా విలేకరులపై దురుసుగా మాట్లాడుతూ అసలెందుకు సమాచారం చెప్పాలంటూ కన్నెర్ర చేశారు. గురజాల సెబ్ కార్యాలయం వైసీపీ నేతలతో ఎప్పుడూ కిటకిటలాడుతోంది. రోజూ వైసీపీ నేతలు సెబ్ కార్యాలయానికి ఎందుకు వస్తున్నారు.. అక్రమ మద్యం కేసులో పట్టుబడిన వారిని రక్షించడానికే వస్తున్నారంటూ విమర్శలు వెలువెత్తుతున్నాయి. స్టేషన్ పరిధిలో వందల కొద్దీ మద్యం బాటిళ్లు పట్టుకున్నా మీడియాకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచుతున్నారు. మద్యం పట్టుకొని లంచాలు తీసుకొని వదిలేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టుబడిన అక్రమ మద్యం కేసు వివరాలను గోప్యంగా ఉంచిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## 73,776 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 78,010 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 73,776 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,483 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| **నాన్ ఏసీ కామన్ వెరైటీ** | | |
| 334 | 8500 | 18000 |
| నెంబరు. 5 | 9000 | 12000 |
| 273 | 12500 | 13000 |
| 341 | 8500 | 16000 |
| 4884 | 9000 | 14500 |
| సూపర్ 10 | -- | -- |
| **నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ** | | |
| తేజ | 8000 | 20000 |
| బ్యాడిగి | 9000 | 16000 |
| దేవనూరు డీలక్స్ | 9000 | 16000 |
| తెల్లకాయలు | 5000 | 11500 |

## హెలీప్యాడ్‌ను ధ్వంసం చేసినవారు కాపు ద్రోహులే ..



మాట్లాడుతున్న టీడీపీ కాపు సంఘం నాయకులు

పొన్నూరుటౌన్, మే6: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పొన్నూరు పర్యటనను అడ్డుకోవటానికి హెలిప్యాడ్‌ను తవ్వి ధ్వంసం చేసిన వారు కాపు ద్రోహులేనని కాపు సంఘం నాయకుడు మండిపడ్డారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ వైసీపీ మూకలు అడ్డంకులు సృష్టించాలని ప్రత్నించటం దారుణం అన్నారు. అయినప్పటికి జనసైనికులు టీడీపీ, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పవన్ కళ్యాణ్ పర్యటనను విజయవంతం చేయటం వైసీపీకి చెంపపెట్టు అన్నారు. అంబటి మురళీ, కిలారి రోశయ్య కాపులను మోసం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కాపు ముసుగులో వచ్చిన మోసగాళ్లను దరిచేరనీయవద్దని ప్రజలను హెచ్చరించారు. కాపు కులాన్ని అడ్డంపెటుకొని రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు. సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆకుల సాంబశివరావు, యరసారి శ్రీరామమూర్తి, తోట ప్రసాద్, కత్తుల రవి కిరణ్, రాజేష్, తోట శ్రీను, సాయిబాబు, సాయికుమార్ పాల్గొన్నారు.

## హత్య కేసులో భార్య, ప్రియుడు సహా నలుగురు అరెస్టు

- వివాహేతర సంబంధంతో ఘాతుకం ..



హత్య కేసు నిందితులు

గుంటూరు, మే 6: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో ప్రియుడు, అతని అనుచరులతో కలసి భార్య కట్టుకున్న భర్తనే కడతేర్చింది. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టుచేసి, రిమాండుకు తరలించారు. ఈ మేరకు సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొత్తపేట సీఐ అన్వర్ బాషా నిందితులను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు.

ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం ఆర్.ఉమ్మడివరం గ్రామానికి చెందిన కుక్కమూడి ప్రేమ్ కుమార్(35) తన భార్యా పిల్లలతో బతుకుతెరువు నిమిత్తం గుంటూరు వచ్చి బుచ్చయ్యతోట ఒకటో లైన్‌లో నివాసం ఉంటున్నాడు. అతను మార్కెట్లో పండ్ల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. అతని భార్య భారతి సమోసాలు తయారు చేసే షాపులో పనికి వెళుతుంటుంది. ఈ క్రమంలో సదరు షాపు యజమాని షేక్ గౌస్‌తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్త ప్రేమ్‌కుమార్‌కు తెలిసింది. దీంతో ప్రేమ్‌కుమార్‌కు, భారతికి మధ్య గొడవలు జరుగుతున్నాయి. తమ వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని, ఆయనను అడ్డు తొలగించుకోవాలని భార్య భారతి భావించింది. దీంతో ప్రియుడు గౌస్‌తో కలసి భర్త ప్రేమ్‌కుమార్ హత్యకు పథకం రూపొందించింది. దీనిలో భాగంగా గౌస్, తన తమ్ముడు ఖాసిం, అతని స్నేహితుడు రెహ్మాన్‌లు కలసి ప్రేమ్‌కుమార్‌ను హత మార్చాలని నిర్ణయించుకున్నారు. గత నెల 28న రాత్రి మాయమాటలు చెప్పి కొర్నెపాడు పరిధిలో ఉన్న జగనన్న కాలనీ అర్బన్ లే అవుట్ వద్దకు తీసుకువెళ్ళి అక్కడ ప్రేమ్ కుమార్‌కు మద్యం త్రాగించి, అనంతరం ఒక కర్ర తో అతనిని వెనుక నుండి కొట్టి, తరువాత వారి వెంట తెచ్చుకున్న కత్తులతో ప్రేమ్ కుమార్ గొంతు కోసి చంపారు తరువాత భారతితో తన భర్త కనబడటం లేదని కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించారు. దీంతో ప్రేమ్‌కుమార్ మృతదేహాన్ని గుర్తుపట్టి, పంచనామా చేసి, హత్యకు ఉపయోగించిన ఆయా ఆయుధాలను స్వాధీన పరచుకున్నట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. దర్యాప్తు అధికారి అయిన ట్రాఫిక్ డీఎస్పీ వివి నాయుడు ఆధ్వర్యంలో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ అన్వర్ బాషా తెలిపారు.



దొడ్లేరులో భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ ఓటర్లు

## చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్

● టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

క్రోసూరు, మే 6 : చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమవుతుందని పెదకూరపాడు నియోజక వర్గ టీడీపీ కూటమి అభివృద్ధి భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం ఊటుకూరు, దొడ్లేరు గ్రామాల్లో పలు కుటుంబాల వారు వేగుంట రాణి, గుడిపాడు భాషాల ఆధ్వర్యంలో భాష్యం ప్రవీణ్ సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఊటుకూరులో షేక్ బాజీ, షేక్ మౌలాలి, షేక్ సైదులు, గర్నెపూడి ఇమ్మానియేలు, శైలజ, కోట ప్రసాదు తదితర వైసీపీ ముఖ్య నాయకులకు చెందిన కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. దొడ్లేరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన పలు కుటుంబాల వారు మండల టీడీపీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి మొగల్ జాన్, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమిదే అధికారమని వైసీపీ నేతలకు అర్థమై పోయిందని, ఆ అసహనంతోనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈవీఎంలో 3వ నెంబరు సైకిల్‌గుర్తుపైన, పార్లమెంట్ ఓటు ఈవీఎంలోని 4వ నెంబరుపైన బటన్‌లు నొక్కి తనను, లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని భాష్యం ప్రవీణ్ కోరారు.



ఊటుకూరులో టీడీపీలో చేరిన వారితో భాష్యం ప్రవీణ్

**ఎన్నికల ప్రచారంలో ప్రవీణ్ సతీమణి లావణ్య**

పెదకూరపాడులో భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాల నియంత పరిపాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో, నియోజకవర్గంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఈ ఎన్నికల అత్యంత కీలకమన్నారు. ప్రతి ఒక్కరు ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలకు సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఆమె వెంట జీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు తదితరులు ఉన్నారు.



పెదకూరపాడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య

**వైసీపీ నుంచి టీడీపీలోకి ..**

మండలంలోని పలు గ్రామాల నుంచి వైసీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. పెదకూరపాడులోని టీడీపీ కార్యాలయంలో వారికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కలసికట్టుగా ఎమ్మెల్యే, ఎంపీ విజయం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జీడీసీసీ బ్యాంక్ మాజీడైరెక్టర్ ఎన్‌వీవీఎస్ వర ప్రసాదు, మండల టీడీపీ అధ్యక్షులు అర్తిమళ్ళ రమేష్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గల్లా బాబూరావు, బెల్లంకొండ రాంగోపాలరావు, పాటిబండ్ల శివమ్మ, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మండల టీడీపీ నేతలు ఏరువ బాలిరెడ్డి, పాటిబండ్ల రాజారత్నం, షేక్ సుభానీ, జనసేన నేతలు బాలస్వామి పాల్గొన్నారు.

## రానున్నది కూటమి ప్రభుత్వమే

● ఎన్నికల ప్రచారంలో యరపతినేని

గురజాలటౌన్, మే 6: సైకో జగన్‌ను రాబోయే ఎన్నికల్లో ఇంటికి పంపిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని గురజాల అసెంబ్లీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జంగమహేశ్వరపురం, చర్లగుడిపాడు గ్రామాలలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జంగమహేశ్వరపురంకు వచ్చిన యరపతినేని ప్రజలు బాణాసంచా కాల్పులు, డప్పు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని పలు వీధుల్లో ఆయన తిరుగుతూ మేనిఫెస్టోను వివరించారు. అనంతరం చర్లగుడిపాడులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. యరపతినేనిని ఆ గ్రామ ప్రజలు గజమాలలతో స్వాగతం పలికారు. మహిళలు హారతులు పట్టారు. గ్రామమంతా పసుపుమయంగా మారింది. యువత కేరింతలు కొట్టారు. జై టీడీపీ జైజై యరపతినేని అంటూ నినాదాలతో హోరెత్తించారు. ప్రతి వీధిలో అడుగడుగునా మహిళలు, యువత, వృద్ధులు స్వాగతించారు. యరపతినేని మాట్లాడుతూ కూటమితోనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రాజారెడ్డి రాజ్యాంగం అమలు చేశారన్నారు. కూటమి అధికారంలోకి అంబేద్కర్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. ఎన్నికల్లో 155 అసెంబ్లీ, పార్లమెంట్ 25 స్థానాల్లో గెలవబోతోందన్నారు. ఐదేళ్లలో గురజాల నియోజకవర్గంలో కాసు మహేష్‌రెడ్డి దోచుకోవడం తప్ప అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. గురజాలను జిల్లా కేంద్రంగా చేస్తామన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రజలకు అభివాదం చేస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో యరపతినేని గజమాలతో సత్కరిస్తున్న గ్రామస్థులు



బాణాసంచా గన్ కాలుస్తున్న యరపతినేని శ్రీనివాసరావు



ఎన్నికల ప్రచార రోడ్‌షోకు భారీ సంఖ్యలో హాజరైన టీడీపీ శ్రేణులు

అండగా ఉంటా..

## ఆశీర్వదించండి

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి

● వైసీపీని వీడి 50 కుటుంబాలు టీడీపీలోకి చేరిక

● పసుపు కుండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించిన బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, మే 6: నియోజకవర్గంలో ఎవ్వరికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని, తనను ఆదరించి గెలిపించాలని మాచర్ల కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన వెల్దుర్తిలోని టీడీపీ కార్యాలయంలో తాళ్లపల్లి, భైరవునిపాడు, చింతల తండానుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీవర్గాలకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కూటమి బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సూపర్ 6 పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ప్రతి పేదవాని ఇంట్లో వెలుగులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో గుండాల శ్రీనివాస్ యాదవ్, బ్రహ్మానాయుడు, వెంకటేశ్వర్లు చౌదరి, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

**నాన్నను గెలిపించండి ..**

రెంటచింతల: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నాన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించి తొలిసారి అసెంబ్లీకి పంపాలని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి కుమారుడు నాగార్జునరెడ్డి ఓటర్లను అభ్యర్థించారు. సోమవారం జెట్టిపాలెం గ్రామంలో పర్యటించారు. తొలుత టీడీపీ సీనియర్ నేత మున్నా ముత్తయ్య మాతృమూర్తి సుబ్బమ్మ(107) మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలకు సంక్షేమ పథకాలు అందించాలంటే చంద్రబాబు సీఎం కావాల్సిన ఆవశ్యకతను వివరించారు. అధికారంలో చేతిలో ఉంది కదా అనే భావంతో విర్రవీగితే ఓటర్లు తప్పకుండా గుణపాఠం చెబుతారన్నారు. ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేగా బ్రహ్మారెడ్డిని గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రభురాజ్ యాదవ్,గొట్టం శ్రీనివాస రెడ్డి,మల్లయ్య,లింగయ్య,సాంబిరెడ్డి,బి.శివారెడ్డి,ఊదే నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, కాయితి రవి, బోడపాటి రామకృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో జూలకంటి బ్రహ్మారెడ్డి

## అరాచకమా.. అభివృద్ధా.. ఏం కావాలి?

● వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుంది..

● అందుకే విచక్షణ కోల్పోయి దాడులకు తెగబడుతున్నారు

● అంబటి అల్లుడి వ్యాఖ్యలను ప్రజలు ఎప్పుడో గమనించారు

● సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ



కన్నా లక్ష్మీనారాయణకు దిష్టి తీసి స్వాగతం పలుకుతున్న మహిళలు

సత్తెనపల్లి, మే 6: అరాచకం కావాలో.. అభివృద్ధి కావాలో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం దగ్గర పడిందని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే ఈనెల 13న జరగనున్న ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడాలని కుట్రలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఒక పక్క కూటమి నేతలపై దాడులకు తెగబడుతూ.. మరో పక్క ప్రజలను ప్రలోభాలకు గురిచేస్తుందని ఆరోపించారు. వైసీపీ నేతల కుట్రలకు గమనించి ఆ పార్టీ అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. నకరికల్లు మండలం కుంకలగుంటకు చెందిన టీడీపీ కార్యకర్తలు డాక్టర్ సాయికృష్ణను కలిసేందుకు నరసరావుపేట వస్తుండగా వైసీపీ మూక వెంబడించటం, పోలీసు స్టేషన్ వద్దే కారు టైర్లు కోయటం వంటివి చేస్తున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించటం సరికాదన్నారు. టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి, కారు టైర్లు ధ్వంసం చేసిన వైసీపీ గూండాలపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యల గురించి విలేకరులు కన్నాను ప్రశ్నించగా అంబటి అల్లుడు ఎవరో తనకు ఇప్పటివరకు తెలియదన్నారు. తన తప్పులను కప్పి పుచ్చుకొనేందుకే అంబటి పెద్దగా మాట్లాడతారని ఆయన అల్లుడే చెప్పటాన్ని నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఓడిపోయేందుకు సిద్ధంగా వున్న అంబటిపై కుట్రలు చేయాల్సిన అవసరం చంద్రబాబుకి, పవన్‌కల్యాణ్‌కు లేదన్నారు. సమావేశంలో మునిసిప్ మాజీ చైర్మన్ ఎలినేడి రామస్వామి, తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు ఉన్నారు.

**పోస్టల్ ఓటర్లకు ధన్యవాదాలు ..** సత్తెనపల్లి నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో రాక్షస పాలన అంతానికి ఇది మొదటి అడుగు అని అన్నారు.

**సైకో పాలనకు అంతం తప్పదు..**

ముప్పాళ్ళ: సైకో పాలనను అంతం తప్పదని, ఆ పార్టీ అభ్యర్థులను ఓడిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తురకపాలెం, దమ్మాలపాడు, ముప్పాళ్ళ గ్రామాల్లో కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ జగన్ చేతకాని పాలనతో రాష్ట్రం అభివృద్ధిలో 30 ఏళ్ళు వెనుకబడి పోయిందని, మళ్లీ రాష్ట్రాన్ని గాడిన పెట్టాలంటే చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. సైకిల్ గుర్తుపై ఓటువేసి శాసన సభ్యుడిగా తనను, ఎంపీగా లావు శ్రీకృష్ణ దేవరాయలును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నేతలు బత్తుల నాగేశ్వరరావు, శిరిగిరి పవన్ కుమార్, గోపాలరావు, వెంకట రావు రావిపాటి మదుబాబు, రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ చంద్రశేఖర్, శ్యామ్, గంగారాం ఖాశిం తదితరులు పాల్గొన్నారు.



ముప్పాళ్ల మండలంలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

## కూటమిని గెలిపించండి.. రాష్ట్రాన్ని కాపాడండి

● ఎన్నికల ప్రచారంలో లావు మేఘన, యరపతినేని నాగమణి



దాచేపల్లిలో లావు మేఘన, యరపతినేని నాగమణిని సత్కరిస్తున్న మహిళలు

పిడుగురాళ్ల, దాచేపల్లి, మే 6: రానున్న సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ అభ్యర్థులైన ఎంపిగా లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేగా యరపతినేని శ్రీనివాసరావులను గెలిపించి చంద్రబాబును సీఎం చేసి రాష్ట్రాన్ని కాపాడుకోండి....టీడీపీ గెలిపించండి అంటూ నరసరావుపేట ఎంపి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు సతీమణి డాక్టర్ మేఘన, ఎమ్మెల్యే అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సతీమణి నాగమణిలు సోమవారం పిడుగురాళ్లలోని ఆక్స్‌ఫర్డ్ ఏరియా, దాచేపల్లిలోని 10వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దాచేపల్లి నగర పంచాయతీలోని అంకమ్మ తల్లి దేవాలయంలో తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, అభివృద్ధికి బాటలు వేయాలని వారు కోరారు. వైసీపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పంపిణీ పథకాలతో పాటు 4 వేల రూపాయల పింఛన్‌ను ఇంటింటికి అందజేయడం జరుగుతుందన్నారు. ప్రజలతో మమేకమైన మహిళా నాయకులు వారివారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాచేపల్లిలో గుడి, బడి, వైద్యశాలలు, రహదారులు వంటి అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు సేవ చేసింది టీడీపీయేనని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కర్నాటి వరలక్ష్మీ, మాజీ సర్పంచ్ బెల్లంకొండ భారతి, జనసేన కౌన్సిలర్ అంబటి రేణుక, కౌన్సిలర్లు వేముల జయలక్ష్మీ, బాదం వరలక్ష్మీ, చల్లగుండ్ల సీత, దియ్యా విజయ, వున్నం భారతి, తదితర మహిళలు పాల్గొన్నారు.

## అమరావతిలో కూటమి జనప్రవాహం

● రోడ్‌షోకు తరలివచ్చిన ఉమ్మడి కూటమి నేతలు కార్యకర్తలు

● పాల్గొన్న అమరావతి రాజధాని ప్రాంత గ్రామాల రైతులు



రోడ్‌షోలో మాట్లాడుతున్న కొమ్మాలపాటి, పక్కన భాష్యం ప్రవీణ్ తదితరులు

అమరావతి, మే 6: పెదకూరపాడు నియోజకవర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అమరావతి మండల పరిధిలో నిర్వహించిన రోడ్‌ షో ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు, రాజధాని మహిళలతో జనప్రవాహాన్ని తలపించింది. రోడ్ షోలో టీడీపీ, జనసేన, బీజేపీ జిల్లా నేతలు కొమ్మాలపాటి శ్రీధర్, గాదె వెంకటేశ్వరరావు, ఆలోకం సుధాకర్ బాబులతో పాటు అమరావతి బహుజన జేఏసీ కన్వీనర్ పీ.బాలకోటయ్య, అమరావతి జేఏసీ నాయకులు, సుధాకర్, రాయపాటి శైలజ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల వెంకటేష్ యాదవ్, నియేజకవర్గ జనసేన నాయకులు రామకృష్ణ, బీజేపీ నాయకులు వెంగళరెడ్డి, భాష్యం విద్యాసంస్థల డైరక్టర్ భాష్యం రామకృష్ణ, జాతీయపంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాష్టి వీరాంజనేయులు, కాపునాడు జిల్లా అధ్యక్షుడు పి వెంకటసత్యనారాయణ ర్యాలీలో ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు. ఈ రోడ్‌షో స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి మొదలై గాంధీబొమ్మ సెంటర్ మీదుగా ధరణికోట జైల్‌సింగ్ కాలనీ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి కూటమి, ఎమ్మార్పీఎస్ నేతలు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. దారిపొడవునా ఉమ్మడి కూటమి నాయకులు ప్రసంగించారు. భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ వైసీపీ ఈ ఐదు సంవత్సరాల పాలనలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. మే 13 జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీకృష్ణ దేవరాయలును గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మద్య నిషేధం అమలు చేసి ఎన్నికలలో ఓట్లు అడుగుతానని ప్రకటించిన జగన్మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యాన్ని రాష్ట్ర ప్రధాన ఆదాయ వనరుగా మార్చాడని ఎద్దేవా చేశాడు. పేదలకు రూ.10 ఇచ్చి రూ.100 లాక్కున మోసగాడు జగన్ అని విమర్శించారు. ఉమ్మడి కూటమి గెలుపుతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా ముందుకు సాగుతుందన్నారు. ఆలోకం సుధాకర్‌బాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శంకరరావు శాండ్, మైన్, వైన్, ల్యాండ్‌లలో దేనిని వదలకుండా అవినీతిచేసి రూ.కోట్లు సంపాదించాడని, ప్రజల నుంచి దోచుకున్న సంపదతోనే ఎన్నికలలో గెలవాలని చూస్తున్నారన్నాడని అన్నారు. ప్రతి ఒక్కరు ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు. పోతుల బాలకోటయ్య, రాయపాటి శైలజ మాట్లాడుతూ రాజధానికి భూములిచ్చి రైతులను అన్యాయంచేసి వారిపై కేసులు పెట్టి వికృతక్రీడ ఆడిన సీఎం జగన్మోహనరెడ్డిని ఈ ఎన్నికలలో ఓడించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరు ఉమ్మడికూటమికి మద్దతు పలకాలని కోరారు.

**వైసీపీని గద్దెదించేందుకు ప్రజలు సిద్ధం..**

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు రాష్ట్రంలోని ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో కూటమి విజయఢంకా మోగిస్తుందన్నారు. ఇప్పటికీ కొందరు అధికారులు వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని వారు ఇప్పటికైన పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు.



జనప్రవాహాన్ని తలపిస్తున్న పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ రోడ్‌షో

## వైసీపీ దాడులపై టీడీపీ నేతల ఫిర్యాదు

మాచర్లటౌన్, మే 6: వైసీపీ శ్రేణులు చేస్తున్న దాడులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు సోమవారం టీడీపీ నేతలు ఎమ్మెల్సీ ఎంఎస్ రామకృష్ణ, మన్నవ సుబ్బారావు, వర్ల రామయ్య, చిన్నపురెడ్డిలు ఫిర్యాదు చేశారు. ఆదివారం మండలంలోని అలుగురాజుపల్లిలో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ శ్రేణులు దాడి చేశారని, అలాగే వైసీపీ మూకదాడిలో విజయపురిసౌత్ హెడ్ కానిస్టేబుల్ సాంబనాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయని, ఈ ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేయలేదని వివరించారు. అలాగే గుంటూరులోని పట్టాభిపురం, నల్లపాడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో వైసీపీ నేతలు పోలీసులపై దాడిచేసి విచక్షణా రహితంగా కొట్టారని, వారిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. రాష్ట్రంలో పోలీసులకే రక్షణ లేకుంటే సామాన్య ప్రజల పరిస్థితి ఏంటని ఆందోళనవ్యక్తం చేశారు. వైసీపీ దాడుల్లో నిందితులపై కఠిన చర్యలు తీసుకొని, శాంతిభద్రతలను పరిరక్షించాలని టీడీపీ నేతలు ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా కోరారు.

## వడదెబ్బకు వృద్ధురాలు మృతి

మాచవరం, మే 6 : మాచవరం మండలం గంగిరెడ్డిపాలెం శివారు గాంధీనగర్ గ్రామానికి చెందిన యామినేని జానమ్మ (85) వడదెబ్బకు గురై సోమవారం మృతి చెందింది. గత నాలుగు రోజులుగా అధిక ఉష్ణోగ్రతల వల్ల నీరసానికి గురై ఇంటివద్దనే చికిత్స పొందుతున్నది. ఆరోగ్యం క్షీణించి సోమవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

## పిడుగుపడి ఇద్దరు మృతి

అచ్చంపేట, మే6: మండలంలోని పెదపాలెం గ్రామానికి చెందిన దంతాల లక్ష్మీనారాయణ (55), మాదిపాడు పంచాయతీ పరిధిలోని గింజుపల్లి తండాకుచెందిన ధరావత్తు బాబు నాయక్ (62) సోమవారం సాయంత్రం పిడుగులు పడి సంఘటనా స్థలంలో మృతి చెందారు. లక్ష్మీనారాయణ గ్రామ సమీపంలోనే ఉన్న నెల్లూరి వెంకటేశ్వర్లు(మేడ గురవయ్య) పొలాన్ని కౌలుకు తీసుకొని సేద్యం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సాయంత్రం 4 గంటల సమయంలో పొలం వద్దకువెళ్ళాడు. ఉరుములు, మెరుపులతో కూడిన చిరు జల్లులు పడటంతో పిడుగు పడి పొలంలోనే తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఈయనకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇదిలా ఉండగా గింజుపల్లి తండాకు చెందిన ధరావత్తు బాబునాయక్ పొలంలో ఉన్న పశువులను తోలుకొని వచ్చేందుకు వెళ్ళటంతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంలో పిడుగు పాటుకు గురై మృతి చెందినటు బంధువులు తెలిపారు. బాబు నాయక్‌కు భార్య, దీనాబాయి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రెండు గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. బంధువులు శోకసంద్రంలో మునిగారు.



లక్ష్మీనారాయణ(ఫైల్)



బాబు నాయక్ (ఫైల్)

## టీడీపీ దళిత నేత రఘు ఇంటికి నిప్పు

రెంటచింతల,మే 6: మండలంలోని మంచికల్లు గ్రామానికి చెందిన టీడీపీ దళిత నేత దాసరి రఘు ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సోమవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా గృహం దహనమై ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాసరి రఘు, భార్గవిలు ఆదివారం అడిగొప్పుల గ్రామం వెళ్లి సోమవారం సాయంత్రం తిరిగి వచ్చారు. ఇళ్లంతా కాలిపోయి ఉంది. ఇంటిలోని కుర్చీలు, కూలర్, డబుల్ కాట్ మంచం పూర్తిగా కాలిపోయి ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని రెంటచింతల ఏఎస్ఐ హనుమంతరావు సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.



మండాదిలో నేల రాలిన బొప్పాయి కాయలు


## ఈదురు గాలులకు పంట ధ్వంసం

వెల్దుర్తి, మే 6: ఆదివారం రాత్రి కురిసిన ఈదురు గాలులతో కురిసిన వర్షం దాటికి మండల పరిధితో విద్యుత్ స్తంభాలు, పంటలు నేలకొరిగాయి. మండాది, ఉప్పలపాడులో ఈదురుగాలులు ఎక్కువగా వీయడంతో చేతికొచ్చిన బొప్పాయి పంట నేలరాలి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కూడా గాలుల ధాటికి నేలకూలాయి. విద్యుత్ అధికారులు మరమ్మతు చర్యలు చేపట్టారు.

## అనిల్.. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడు


దాచేపల్లి, మే 6: నరసరావుపేట వైసీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని గామాలపాడు గ్రామ సర్పంచ్ జంగా సురేష్ అన్నారు. సోమవారం గామాలపాడులో జంగా సురేష్ ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గామాలపాడుకు వచ్చిన అనిల్‌కుమార్ యాదవ్ ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తికి, ఆయన తనయులకు జడ్పీటీసీ, సర్పంచ్ పదవులు ఇచ్చామని, ఒకే ఇంట్లో మూడు పదవులు ఇచ్చామని, ఎంపీ పదవి కూడా ఇస్తామని చెప్పడం, పైగా ఇది నిజమా కాదా అని గంగమ్మతల్లి దేవాలయం వద్ద ప్రమాణం చేయాలని కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ వ్యవస్థాపకుల్లో ఎమ్మెల్సీ జంగాకు పదవులు ఊరకే రాలేదన్న విషయం ఆయను తెలియక పోవడం విచారకరమన్నారు. ఈరోజు జంగా అన్నా అని మాట్లాడుతున్న అనిల్‌కుమార్ యాదవ్ ఆయన వెంటపెట్టుకొని తిరుగుతున్న కాసు మహేష్‌రెడ్డి నియోజకవర్గంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొంటే ఎందుకు మాట్లాడడని ప్రశ్నించారు. సమావేశంలో బొంబోతుల శ్రీనివాసయాదవ్ జక్కుల వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని, యువత భవిష్యత్తుని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు కూటమికి మద్దతు ఇచ్చేలా సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ సోమవారం పిడుగురాళ్ల పట్టణంలోని 9వ వార్డులో హిందూ, ముస్లిం మహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేయడంతో పాటు యరపతినేని శ్రీనివాసరావు అందించే పథకాలను గుర్తుచేస్తూ యరపతినేనిని, శ్రీకృష్ణదేవరాయలుని గెలిపించాలని గంధం, కుంకుమతో బొట్టుపెట్టి కోరారు. - **పిడుగురాళ్ల**



## మైనారిటీలను మోసం చేసిన జగన్

పిడుగురాళ్ల, మే 6: మైనారిటీలను వైసీపీ ప్రభుత్వం ఎన్నో విధాలుగా మోసం చేసిందని టీడీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. సోమవారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జగన్ అధికారంలోకి రావడంతోనే ప్రజావేదిక కూల్చివేతతో మొదలై ముస్లిం , ఎస్సీ, ఎస్టీ, బిసి కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేశాడని, అలాంటి జగన్, వైసీపీ నేతలకు మైనారిటీల ఓటు అడిగే హక్కు లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్ కొనసాగుతుందని, వైసీపీ నేతల అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. మైనారిటీసెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలి మాట్లాడుతూ ముస్లిం హక్కులను కాలరాస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రతి ఒక్కరు సన్నద్ధమవ్వాలన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ నాయకులు షేక్ బాబావలి, షేక్ అబ్దుల్ హఫీసాబ్, ముజీబ్, ఫరీద్ మేస్త్రి, మస్తాన్‌వలి, కారు సైదా, షేక్ జిలాని, ఇర్షాద్, మున్నా, షఫీ, షేక్ నాగూర్‌బీ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నెస్పీ కాలువలకు లైనింగ్ చేసిన దృశ్యం

# ప్రచారం.. ఉత్సాహం

- ప్రచారంలో కన్నాకు బ్రహ్మరథం
- టీడీపీ, జనసేన, బీజేపీ ఐక్యంగా ముందుకు...

సత్తెనపల్లి, మే6: సత్తెనపల్లి నియోజకవర్గంలో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. కన్నా లక్ష్మీనారాయణ నియోజకవర్గం బాధ్యతలు చేపట్టిన దగ్గర నుంచి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి చైతన్య వంతులను చేశారు. అన్ని గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సూపర్ - 6 పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. నాగార్జున సాగర్ కాలువలు బాగు చేయించి రైతులకు సాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తానని ప్రచారంలో హామీ ఇస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారు. అన్ని గ్రామాల్లో కన్నా ప్రచారానికి ప్రజల నుంచి మద్దతు లభిస్తుంది. ఇప్పటికే కన్నా లక్ష్మీనారాయణ మీద నమ్మకంతో నియోజక వర్గంలోని వందలాది కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. కన్నా లక్ష్మీనారాయణను గెలిపించటమే తమ ధ్యేయం అంటూ వారు కన్నా విజయం కోసం ముమ్మరంగా కృషి చేస్తున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా కన్నా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా మహిళలు హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలుకుతున్నారు. ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వస్తే ప్రభుత్వం చేయబోయే సంక్షేమ పథకాలను కన్నా ప్రజలకు వివరిస్తున్నారు. ఈ ప్రచారం ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. నియోజకవర్గంలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేయిస్తానని కన్నా ప్రచారంలో హామీ ఇస్తున్నారు. అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా, రాష్ట్ర అభివృద్ధి జరగాలన్నా, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు రావాలన్నా ఎన్‌డీఏ కూటమిని అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత గురించి కన్నా ప్రజలకు తెలియ జేస్తున్నారు. సైకో పాలన గురించి ప్రజలకు వివరిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటువేసి తనను, నరసరావుపేట లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని ప్రజలను కోరుతున్నారు. తనకు ఓటు వేసి గెలిపిస్తే ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెపుతున్నారు. రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకుడైన కన్నాను గెలిపించు కోవాలని అన్ని సామాజిక వర్గాల నేతలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. నియోజక వర్గంలో కన్నా ప్రచారానికి లభిస్తున్న ఆదరణ చూసి కన్నా లక్ష్మీనారాయణ అత్యధిక మెజార్టీతో విజయం సాధించటం ఖాయమని విశ్లేషకులు అంటున్నారు. కన్నా విజయం కోసం ఆయన కుమారులు కన్నా నాగరాజు, కన్నా ఫణీంద్రలు పార్టీ నేతలను, కార్యకర్తలను కలుసుకొని ముందుకు సాగుతున్నారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న కొద్ది నియోజక వర్గంలో కన్నా ప్రచారం ఊపందుకుంది.



ముప్పాళ్ళ మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణకు ఘన స్వాగతం పలుకుతున్న మహిళలు

# అభివృద్ధి.. ఆనవాళ్లు

- వినుకొండ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా జీవీ సేవలు

వినుకొండ, మే 6: వినుకొండ నియోజకవర్గంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి ప్రస్తుతం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న జీవీ ఆంజనేయులు తాను శాసనసభ్యునిగా ఉన్నప్పుడు అభివృద్ధే ధ్యేయంగా కృషి చేశారు. 2009 నుంచి 2019వరకు జీవీ వినుకొండ శాసనసభ్యునిగా పనిచేశారు. సగం కాలం ప్రతిపక్షంలో ఉన్నారు. రాష్ట్రవిభజన తర్వాత 2014నుంచి ఐదేళ్ళపాటు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించారు. చంద్రన్నబాట పేరుతో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో నియోజకవర్గంలో ఎన్నడూ లేనివిధంగా అంతర్గత రహదారులు వేశారు. గతంలో అభివృద్ధికి నోచుకోని గ్రామాలను దత్తత చేసుకొని ప్రభుత్వ నిధులతో పాటు సొంత నిధులను వెచ్చించి అభివృద్ధి చేశారు. నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీకి 10లక్షలతో శ్మశానవాటికలను అభివృద్ధి చేశారు. శావల్యాపురం మండలం కొత్తలూరు పంచాయతీ శివారు గుర్రంవారిపాలేనికి సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో 3.81కోట్లు పంచాయతీరాజ్ నిధులతో 2.3కిమీ తారురోడ్డు ఏర్పాటు చేశారు. కృష్ణాపురం నుంచి ఈపూరు మండలం వనికుంట వరకు తారురోడ్డును వేశారు. వేల్పూరు గ్రామంలో ఎస్సీ కాలనీకి సమీపీనున్న బావి నుంచి రూ.5లక్షల నిధులతో పైప్‌లైన్ వేయించి కాలనీ వద్ద మినీ ట్యాంక్‌ను ఏర్పాటు చేశారు. గంటవారిపాలెం రైతులకు ఏబీసీ కెనాల్‌పై వంతెన ఏర్పాటు చేశారు. మతుకుమల్లిలో రూ.20లక్షలతో ఎస్సీ బీసీ కాలనీల్లో అంగన వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వినుకొండ ఐసీడీఎస్ భవన నిర్మాణం చేయించి అప్పటి మున్సిపల్ శాఖా మంత్రి చిన్నరాజప్పతో ప్రారంభోత్సవం చేశారు. ఉపాధి హామీ నిధులతో 329కిమీ మేర గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణం చేశారు. ఆర్అండ్‌బీ పరిధిలో రూ.36కోట్లుతో రహదారులను ఏర్పాటు చేశారు. సింగిల్ లైన్‌తో ఇబ్బంది పడుతున్న దర్శి- కురిచేడు- మాచర్ల రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చి వినుకొండ వరకు రెండు వరుసల రోడ్డును ఏర్పాటు చేశారు. నీరు-చెట్టు కార్యక్రమం ద్వారా రూ.30.54కోట్ల నిధులతో చెరువుల్లో పూడికతీత పనులు, చెరువు కట్టలను బలోపేతం చేయించారు. అలుగులు, తూములను పునర్నిర్మాణం చేయించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 759 కంపోస్ట్ పిట్స్ నిర్మించి రైతులకు చేయూతనందించారు. 5.67కోట్లతో 81అంగన్‌వాడీ భవనాలు నిర్మించారు. నియోకవర్గంలో ఇళ్ళులేని పేదలకు 7,264 పక్కా ఇళ్ళను మంజూరు చేయించి వాటిలో 5వేల వరకు పూర్తి చేశారు. వినుకొండ పట్టణ పేదలకు 4096 టిడ్కో ఇళ్ళు మంజూరు చేయించి అప్పటి మంత్రి నారాయణ చేతులమీదుగా శంకుస్థాపన చేయించి తొలిదశలో 1440 గృహాలు 70శాతం పనులు పూర్తి చేశారు. రూ.36.30 కోట్లతో 29వేల వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేయించారు. బొల్లాపల్లి మండలంలో నీటిసమస్య ఉన్న 5గ్రామాలకు వాటర్‌షెడ్ పథకం ద్వారా రూ.3కోట్లు నిధులు మంజూరు చేయించారు. వాటితో చెక్ డ్యాంలు, కుంటలలో పూడికతీత పనులు పూర్తి చేశారు. 150కోట్లు నిధులతో సాగర్ కాలువ ఆధునికీకరణ పనులు చేశారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ కుడి కాలువతో పాటు నూజండ్ల మండలంలోని వివిధ కాలువలకు సిమెంట్ లైనింగ్‌లు వేయించి కట్టలు బలోపేతం చేయడంతో చివరి పొలాల రైతులకు నిరాటంకంగా సాగునీరందించింది. తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్న వినుకొండ పట్టణ ప్రజల కోసం ఏఐఐబీ ద్వారా 161కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ నిధులతో శింగర చెరువును అభివృద్ధి చేయడంతో పాటు 5వేల ఇళ్ళకు కుళాయి కనెక్షన్‌లు కూడా ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సాగర్ నీటిని ప్రతిరోజూ సరఫరా చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి టెండర్‌లు పిలిచాక ప్రభుత్వం మారడంతో పథకం అటకెక్కింది. పట్టణంలో డివైడర్‌లు ఏర్పాటు చేసి మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దారు. గిరిజన బాలుర, బాలికల గురుకులాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రికి రూ.70లక్షలు నిధులతో ఆధునికీకరించి మెరుగైన వసతులు కల్పించారు. జన్మభూమి స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన జీవీ సొంతూరు ఈపూరు మండలం ఇనిమెళ్ళ గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం ద్వారా మాత్రమే కాకుండా తన సతీమణి గోనుగుంట్ల లీలావతి ఛైర్మన్‌గా ఉన్న శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో విద్యాలయాలు, దేవాలయాలకు సొంత డబ్బును విరాళాలుగా అందజేసి తన దాతృత్వాన్ని చాటుకొన్నారు. గ్రామంలో అప్పట్లో ప్రాథమిక పాఠశాల మాత్రమే ఉండేది. 7నుంచి 10వరకు చదవాలంటే విద్యార్థులు ముప్పాళ్ళ, కుంకలగుంట గ్రామాలకు వెళ్ళాల్సి వచ్చేది. పరిస్థితి తెలుసుకొన్న జీవీ రెండెకరాల స్థలాన్ని సమకూర్చి గ్రామంలో జడ్పీపాఠశాల ఏర్పాటుకు కృషి చేశారు. సొంత డబ్బును వెచ్చించి అదనపు గదులను నిర్మించారు. అధికారంలో ఉన్నా లేకపోయినా అభివృద్ధి కోసం తపన పడే జీవీ ఆంజనేయులు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థిగా ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్నారు. వినుకొండ నియోజకవర్గం అభివృద్ధి బాటలో పయనించాలంటే అది ఒక్క జీవీతోనే సాధ్యమని నమ్మిన ప్రజలు జీవీ వెన్నంటి నడుస్తూ గెలుపు కోసం కృషి చేస్తున్నారు.




మదమంచిపాడు వద్ద గుండ్లకమ్మపై నిర్మించిన బ్రిడ్జి


నరసరావుపేటలో క్యూలో మహిళా ఉద్యోగులు

# జిల్లాలో 83.04 శాతం పోలింగ్

- 8 వరకు పోస్టల్ బ్యాలెట్‌కు అవకాశం

నరసరావుపేట, ఏప్రిల్ 6: జిల్లాలో నరసరావుపేటలో మినహా అన్ని నియోజకవర్గాల్లో ఉద్యోగ ఓటర్ల పోలింగ్ రెండో రోజు సోమవారం ప్రశాంతంగా జరిగింది. రెండు రోజుల్లో 83.04 శాతం మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 16,282 మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్లు జారీ చేయగా 13,521 మంది వినియోగించుకున్నారు. వేసవి ఉక్కతో క్యూలైన్లలో ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న వారందరూ 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్‌ను వినిగించుకోవచ్చని కలెక్టర్ శివశంకర్ తెలిపారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ ఇలా..

| నియోజకవర్గం | ఉద్యోగ ఓటర్ల సంఖ్య | పోలైన ఓట్లు | పోలింగ్ శాతం |
|---|---|---|---|
| పెదకూరపాడు | 1929 | 1682 | 87.20 |
| చిలకలూరిపేట | 2207 | 1907 | 86.41 |
| నరసరావుపేట | 2859 | 2424 | 84.78 |
| సత్తెనపల్లి | 2303 | 1843 | 80.03 |
| వినుకొండ | 2373 | 2050 | 86.39 |
| గురజాల | 2338 | 1804 | 77.16 |
| మాచర్ల | 2273 | 1811 | 79.67 |

# జంగా రాకతో.. జోష్

- ఆత్మగౌరవ నినాదంతో రగిలిన రాజకీయ జ్వాల
- ఎన్నికల వేళ వైసీపీకి భారీ దెబ్బ
- కృష్ణమూర్తి ప్రభావంతో అధికార పార్టీకి దూరమైన బీసీలు



గుంటూరు సిటీ, మే6: రాజకీయాల్లో శాశ్వత మిత్రులు.. శాశ్వత శత్రువులు ఉండరు అన్న నానుడి ఉంది. ఎన్నికల వేళ గురజాలలో ఆ నానుడి నిజమైంది. ఒకప్పుడు ప్రత్యర్థులుగా ఉన్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఒకే గొడుగు కిందకు వచ్చారు. అధికార వైసీపీ ఎమ్మెల్సీ గా ఉన్న జంగా ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. బీసీ సామాజిక వర్గంలో మంచి పట్టున్న జంగా దూరం కావటం అధికార పార్టీకి కోలుకోలేని దెబ్బ తగిలింది. పార్టీలో నుంచి బయటకు వస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా వైసీపీకి భారీ నష్టాన్ని కలిగించే విధంగా ఉన్నాయి. ఈ పరిణామం తెలుగుదేశం పార్టీకి బాగా కలిసొచ్చింది. జనసేన పొత్తుతో ఇప్పటికే గురజాలలో గెలుపు జోష్‌లో ఉన్న టీడీపీకి జంగా రాక అదనపు హంగును తీసుకువచ్చింది.

**అధికారానికే ముచ్చెమటలు పట్టించిన 'జంగా'**

కార్మిక ఉద్యమ నేపథ్యంలో నుంచి బయటకు వచ్చిన జంగా కృష్ణమూర్తి 2024 ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లా రాజకీయ చిత్రంలో పతాక స్థాయిలో నిలిచారు. వైసీపీ అరాచక పాలనపై ఆయన గళమెత్తటం పెను సంచలనం అయ్యింది. అసలు ఆ పార్టీలో బీసీలకు సరైన గౌరవం లేదన్న విషయాన్ని జంగా గొంతెత్తి చాటటం అధికార పార్టీకి ముచ్చెమటలు పట్టించింది. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గడచిన కాలంలో తనను ఏ విధంగా అవమానించారో ఆయన ఏకరువు పెట్టటంతో బీసీల్లో వైసీపీపై వ్యతిరేక ఆలోచన కలిగించింది. ఎప్పుడైతే జంగా వైసీపీని వీడారో ఆ మరుక్షణమే దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ళ, గురజాలకు చెందిన వ్యుఖ్యనేతలు కూడా ఆ పార్టీకి గుడ్ బై చెప్పేశారు. జంగాతో పాటు మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీ లు, సర్పంచ్‌లు తెలుగుదేశంలో చేరారు.

**రెండు నియోజకవర్గాలపై బలమైన ప్రభావం**

గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో జంగా ప్రభావం స్పష్టంగా కనపడుతుంది. జంగా రాకతో రెండు నియోజకవర్గాలకు చెందిన బీసీలు టీడీపీకి జై కొడుతున్నారు. ముఖ్యంగా యాదవ సామాజిక వర్గం జంగాకు జరిగిన అవమానాన్ని జీర్ణించుకోలేక పోతుంది. అప్పటికి వరకు ఆయా పార్టీల్లో ఉన్న ఆ సామాజిక వర్గం నేతలు ఏకతాటిపైకి వచ్చి కృష్ణమూర్తికి మద్దతుగా నిలిచారు. పల్నాడు ప్రాంతంలో బీసీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా చెప్పబడే జంగాకు ఉద్యమ పార్టీల మద్దతు కూడా సంపూర్ణంగా ఉంది. ఆయా ఉద్యమ పార్టీల్లో ఉన్న కార్యకర్తలు, మాజీలు కూడా జంగా బాటలో టీడీపీకి మద్దతు పలుకుతున్నారు.

**తానే అభ్యర్థి నన్నట్లుగా...**

గురజాల నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం జంగా కృష్ణమూర్తి అహర్నిశలు శ్రమిస్తున్నారు. వైసీపీకి బుద్ధి చెప్పటమే లక్ష్యంగా జంగా పావులు కదుపుతున్నారు. చివరకు రెడ్డి సామాజిక వర్గంలోని కొందరు కీలక నేతలు కూడా ఆయనతో టచ్ లో ఉండటం గమనార్హం. తానే ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లుగా జంగా నిరంతరం శ్రమిస్తున్నారు. యరపతినేని శ్రీనివాసరావును గెలిపించాలని ఆయన ద్వారా మాత్రమే అభివృద్ధి జరుగుతుందని జంగా ప్రచారం చేస్తున్నారు. గడచిన ఐదేళ్ళ లో కాసు వల్ల గురజాలకు ఒరిగింది ఏమి లేదని, కొద్దిమంది మాత్రం సహజ వనరులను కొల్లగొట్టి పెద్ద వాళ్ళు అయ్యారని జంగా ప్రచారం చేస్తుండటం టీడీపీ గెలుపును మరూ చేస్తుంది. మొత్తం మీద అటు జంగా రాక, ఇటు జనసేన పొత్తు గురజాల టీడీపీ మెజారిటీపై పందాలకు కారణం అవుతుంది.


పెదకూరపాడు నియోజక వర్గంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న పెదకూరపాడు నియోజక వర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్

# మారుమూల గ్రామాల్లో... ప్రజాదరణ

- ప్రవీణ్ గెలుపు ఖాయం అంటున్న విశ్లేషకులు

పెదకూరపాడు, మే 6: పెదకూరపాడు నియోజక వర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు గ్రామాల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. ఈనెల 13వ తేదీన జరిగే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలుపుకొని ప్రచారానికి వెళ్తున్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఎండలను సైతం లెక్క చేయకుండా ప్రజలు ప్రవీణ్ వెంట నడుస్తున్నారు. మహిళలు సైతం ప్రవీణ్‌కు హారతులు ఇస్తూ స్వాగతం పలుకుతున్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంబూరు శంకరరావును ఎలాగైనా ఓడించాలని కృత నిశ్చయంతో ఓటర్లు ఉన్నట్టు తెలుస్తోంది. ఏ గ్రామం వెళ్ళినా 60 నుంచి 70 శాతం మంది ప్రజలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. నియోజక వర్గంలో ఏ గ్రామంలో చూసినా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ప్రవీణ్ ప్రచారంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కూడా పాల్గొని విజయానికి విశేషంగా కృషి చేస్తున్నారు. ప్రవీణ్‌తో పాటు ఆయన సతీమణి లావణ్య, కుమారుడు అఖిల్, సోదరుడు నవీన్, వారి కుటుంబ సభ్యులతో పాటు నియోజక వర్గంలోని తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు, మహిళా నేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీలతో పాటు ఇతర సామాజిక వర్గాలన్నీ కూడా ప్రవీణ్‌కు మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రజల నుంచి ప్రవీణ్‌కు స్పందన బాగా పెరిగింది. వైసీపీ ఐదు సంవత్సరాల పాలనలో నియోజక వర్గంలో చేసిన అభివృద్ధి ఏమి లేదని, భారీ మెజార్టీతో ప్రవీణ్ గెలవటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు.


ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రవీణ్...


ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం ప్రవీణ్

# ప్రజల ఆరోగ్యాలకు ధీమా

- ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే 6: రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా రు.25 లక్షలతో ఆరోగ్యబీమా తీసుకు రాబోతున్నామని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావుఅన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల కష్టాలు చూసే ఇంత భారీ మొత్తంతో వారి ఆరోగ్యాలకు భీమాతో ధీమా కల్పించాలని కూటమి తరఫున నిర్ణయం తీసుకున్నామన్నారు. సోమవారం చిలకలూరిపేట ప్రత్తిపాటి గార్డెన్స్‌లో నారీగళం పేరిట మహిళల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్తిపాటి ఎన్నికల్లో మహిళలే కూటమి స్టార్ క్యాంపెయినర్లుగా వ్యవహరించాలని సూచించారు. పథకాల్లో కోతలు, జే బ్రాండ్ మద్యం తీసిన ప్రాణాలు, ధరల పెరుగుదల, పన్నుల మోత కారణంగా అయిదేళ్ల జగన్‌పాలనపై మహిళలంతా విసిగి వేసారి ఉన్నారన్నారు. ఈ అబద్ధాల ముఖ్యమంత్రి జూన్ 4న కౌంటింగ్ ప్రారంభమైన గంటకే తాడేపల్లి ప్యాలెస్‌ను ఖాళీ చేసి పారిపోతారని ఎద్దేవా చేశారు. డ్వాక్రా రుణాల మాఫీ, విద్యా దీవెన డబ్బులైనా ఖాతాల్లో పడ్డాయా అని ప్రశ్నించారు. జగన్ బటన్ నొక్కుడు మోసాలకు అదే నిదర్శమన్నారు. కూటమి సూపర్‌సిక్స్ పథకాలతో 50 ఏళ్ల నిండిన అందరికీ రూ.4 వేల పింఛన్, 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు నెలకు రూ.1500,ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి రూ.15వేల చొప్పున వస్తాయన్నారు. ఆడబిడ్డలందరికీ ఉచిత బస్సు ప్రయాణంతో పాటు ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామన్నారు. చదువుకున్న పిల్లలకు ఉద్యోగం వచ్చే వరకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి లభిస్తుందన్నారు. చిలకలూరిపేటకు సంబంధించి ఒక అవినీతి, మోసకారి మంత్రి దోపిడీకి కూడా సరైన గుణపాఠం చెప్పాల్సి ఉందన్నారాయన. పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 90 శాతం తెలుగుదేశానికే పడతాయన్న నమ్మకంతో ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కందిమళ్ల జయమ్మ, ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి, కుమార్తె స్వాతి, నియోజకవర్గ జనసేన సమన్వయకర్త తోట రాజా రమేష్, తదితరులు పాల్గొన్నారు.


చిలకలూరిపేటలో నారీగళం పేరిట మహిళల ఆత్మీయ సమావేశం

# పల్నాడు వార్తలు





ఉప్పరపాలెంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు



వినుకొండ 30వ వార్డులో టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న లీలావతి

## రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్నదే ఆశయం

**కూటమి వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు**

వినుకొండ, మే 6: రాష్ట్రాన్ని జగన్ రాక్షస పాలన నుంచి కాపాడాలని, రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపించాలనే ఆశయంతోనే తెలుగుదేశం, జనసేన, బీజేపీ జతకట్టాయని, కూటమికి అఖండ విజయం అందించడానికి ప్రజలు ఇప్పటికే సిద్ధమయ్యారని కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రంలో ఏ సర్వే చూసినా కూటమిదే గెలుపు అంటున్న అంచనాలతో ముఖ్యమంత్రి జగన్, వైసీపీ నేతలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి టీడీపీలో చేరికల పరంపర కొనసాగుతుందన్నారు. వినుకొండ మండలం ఉప్పరపాలెం గ్రామానికి చెందిన యాదవులు వైసీపీని వీడి 30 కుటుంబాలు టీడీపీలో చేరారు. అదేవిధంగా ఆయన సతీమణి గోనుగుంట్ల లీలావతి సమక్షంలో సంజీవగాంధీనగర్‌కు చెందిన 50కుటుంబాలు, వెంకుపాలెం నుంచి వలంటీర్‌తోపాటు 15కుటుంబాలు టీడీపీలో చేరాయి. బొల్లాపల్లి మండలం నుంచి గోపిరెడ్డి మల్లికార్జునరెడ్డి, సొంటి సాంబశివరావు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ చంద్ర బాబు, మోదీ, పవన్‌కల్యాణ్‌లది అభివృద్ధి మైత్రి అని స్పష్టం చేశారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. నూత నంగా పార్టీలోకి చేరిన వారందరు కుటంబసభ్యులుగా బావించి రానున్న రోజుల్లో వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని, అధైర్యపడకుండ పార్టీ విజయం కోసం పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

### జనసేనలో చేరిన 300 వైసీపీ కుటుంబాలు

వినుకొండ టౌన్, మే 6: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జనసేన పార్టీ సమన్వయకర్త నాగశ్రీను ఆధ్వర్యంలో గ్రామాల్లోని వైసీపీ నాయకులు ఆ పార్టీని వీడి జనసేన పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు. నూజండ్ల మండలం ముక్కెళ్ళపాడు గ్రామం, శావల్యాపురం మండలం కనమర్లపూడి, వితంరాజుపల్లి నుంచి పలువురు వైసీపీని వీడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జీవీ ఆంజనేయులు నియోజకవర్గంలో జనసేన పార్టీ శక్తివంచన లేకుండ తన విజయం కోసం నిరంతరం శ్రమిస్తున్నారని కొనియాడారు. వివిధ గ్రామాల నుంచి అధికార వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలో చేరికలను పరిశీలిస్తే స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఓటమి తథ్యమన్నారు. వినుకొండకు సేవలు అందించే నాయకులకే పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. అనంతరం జనసేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని జనసేన పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ నాయకులతో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు





బారులు తీరి ఓటు హక్కు ఉపయోగించుకుంటున్న ఉద్యోగులు

## పోస్టల్ బ్యాలెట్‌కు రెండో రోజూ ఇక్కట్లే

**● ఓటుహక్కు వినియోగించుకున్నది 695 మంది ఉద్యోగులు**

వినుకొండ, మే 6: స్థానిక లయోలా పాఠశాల్లో ఏర్పాటుచేసిన బ్యాలెట్ పత్రాల ఓటు నమోదు కేంద్రంలో ఎండల తాకిడికి ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓటర్ నమోదు కేంద్రం వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో ఉక్కపోత తాకిడికి ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానంగా ఇతర జిల్లాలకు చెందిన ఓటర్లు వినుకొండలో ఓటు వేసే సమయంలో జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎట్టకేలకు రెండోరోజు వినుకొండ నియోజకవర్గానికి చెందిన 394మంది, ఇతర జిల్లాలకు చెందిన 301మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఆర్వో సుబ్బారావు తెలిపారు.

### గణపవరంలో...

నాదెండ్ల, మే 6: ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ రెండవ రోజైన సోమవారం కూడా కొనసాగింది. మండలంలోని గణపవరం గ్రామ పరిధిలో కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో సోమవారం నాలుగు బూత్‌లను ఏర్పాటు చేశారు. స్థానికంగా ఉన్న వివిధ శాఖల ఉద్యోగులు 262 మంది పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకున్నారు. అదేవిధంగా ఇతర జిల్లాలకు చెందిన 429 మంది పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకున్న వారిలో ఉన్నారు. మొత్తం 691 మంది పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకున్నట్లయింది. మంగళవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగనున్నది. ఈ కార్యక్రమాన్ని ఆర్వో నారదముని, ఏఈఆర్వోలు జ్వాలా నరసింహం, వరప్రసాదు, అఫ్రున్నీసా బేగం, గోవిందరావులు పర్యవేక్షించారు.

## ఓటమి భయంతోనే వైసీపీ నేతల దాడులు

**● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్**



నరసరావుపేట టౌన్, మే 6: ఓటమి భయంతో వైసీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల అదనపు బలగాలను దించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్వయంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పోలింగ్ కేంద్రం లోపల అధికారులను బెదిరించి, పోలీసులపై చెయ్యివేసి నెట్టేస్తూ హల్‌చల్ చేయటం దారుణం అన్నారు. నరసరావుపేటలో డాక్టర్ చదలవాడను కలవడానికి మా కార్యకర్తలు వస్తే వారిపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేసి, కారుని సైతం ధ్వంసం చేశారన్నారు. టీడీపీ కార్యకర్తలపై వైసీపీ వర్గీయులపై వెంటనే హత్యాయత్నం కేసు నమోదు చేయాలన్నారు. పల్నాడు జిల్లాలో శాంతి భద్రతలు పోలీసులు అదుపులో లేవని, అదనపు బలగాలను వెంటనే దించి ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్స్ నరసరావుపేటలో వైసీపీ శ్రేణులు ఇంతలా రెచ్చిపోతుంటే మిగిలిన నియోజకవర్గాలలో పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి అర్థం చేసుకోవచ్చునన్నారు. నరసరావుపేటలో టీడీపీ కార్యకర్తలపై జరిగిన దాడులు విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్ళతామన్నారు. వైసీపీ నేతలకు ఇవే చివరి ఎన్నికలు అని గుర్తుంచుకోవాలని, దాడిచేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రజలను భయభ్రాంతులను చేసేందుకే దాడి

**● టీడీపీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ**



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కన్నా

నరసరావుపేట టౌన్, మే 6: ప్రజలను భయబాంత్రులను చేయాలని కుంకలగుంట నుంచి నరసరావుపేటలో అనన్యా హాస్పటల్‌లో డాక్టర్ చదలవాడ అరవిందబాబును కలిసేందుకు వస్తున్న టీడీపీ కార్యకర్తలపై దాడిచేశారని టీడీపీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం నరసరావుపేట పట్టణంలోని అనన్యా ఆసుపత్రిలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దాడి జరిగిందని పోలీసు స్టేషన్‌కు వెళ్ళితే అక్కడకు కూడా వచ్చేసి దౌర్జన్యం చేసి కొట్టినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించిన పరిస్థితి ఉందన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఎన్నికల సమయంలో కూడా పోలీసుస్టేషన్‌లో చొరబడి దౌర్జన్యం చేసి పోలీసు స్టేషన్ ముందున్న కారు టైర్లు కోసి, ధ్వంసం చేసినా కూడా పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ విషయాన్ని ఎలక్షన్ కమిషన్ దృష్టికి ఖచ్చితంగా తీసుకెళతామన్నారు. దాడిచేసిన అందరిపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డాక్టర్ సింగమరాజు సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ డబ్బులు కోసం వృద్ధుల ఇక్కట్లు

వినుకొండటౌన్, మే 6: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వృద్ధులకు 6వ తేదీ గడుస్తున్నా పెన్షన్ అందిన దాఖలాలు లేవు. సచివాలయం సిబ్బంది స్పందించకపోవడంతో పెన్షన్‌దారులు పెన్షన్ డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ, బ్యాంకుల చుట్టూ మండుటెండలో ప్రదక్షిణాలు చేయాల్సిన వస్తుందంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చెక్‌పోస్టు సెంటర్‌లో నివాసం ఉంటున్న వెంకటస్వామి అనే వృద్ధుడు పెన్షన్ డబ్బుల కోసం కార్యాలయాలు చుట్టు తిరిగిన ఫలితం లేదని, చివరికి బ్యాంకుకు వస్తే అకౌంట్ ఓపెన్ చేయాలని బ్యాంకు అధికారులు తెలపడంతో ఆయన తీవ్ర మనోవేదనకు గురయ్యారు. అధికారులు తిప్పుతున్నారే తప్ప పెన్షన్ డబ్బులు ఇవ్వడం లేదని వాపోయారు.

## రాబోయేది కూటమి ప్రభుత్వమే

**కూటమి నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు**



వీరవట్నం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అరవింద బాబు

రొంపిచర్ల, మే 6 : రానున్న ఎన్నికల్లో రాబోయేది టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వమేనని అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. మండలంలోని వీరవట్నంలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ దౌర్జన్యాలకు చరమగీతం పాడాలని తెలిపారు. నరసరావుపేట పార్లమెంట్, అసెంబ్లీతో పాటు మిగిలిన నియోజకవర్గాల్లో కూడా కూటమి అభ్యర్థులు గెలుస్తారన్నారు. ఎక్కడికి వెళ్ళినా అపూర్వ ఆదరణ లభిస్తోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. నరసరావుపేట నియోజక వర్గంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి శూన్యం అన్నారు. మండలంలో టీడీపీకి మెజార్టీ వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు, పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, గాడిపర్తి సురేష్, చల్లా సుబ్బారావు, జాష్టి శ్రీను, ప్రసాదు, వెలగటూరి వెంకట నారాయణ, మాలెంపాటి కొండలు తదతరులు పాల్గొన్నారు.

### వీరవట్నంలో నాయకులను కలసిన ఎంపీ లావు

రొంపిచర్ల, మే 6: మండలంలోని వీరవట్నం గ్రామంలో టీడీపీ నాయకులను ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు ఆదివారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం రాగానే గ్రామంతో పాటు మండలంలోని సమస్యలను వివరిస్తామన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

### అల్లూరివారిపాలెంలో భారీగా టీడీపీలో చేరికలు

నరసరావుపేట టౌన్, మే 6: నరసరావుపేట నియోజకవర్గం అల్లూరివారిపాలెంలో సోమవారం భారీగా టీడీపీలో చేశారు. పలుపార్టీలకు చెందిన ఎస్సీ మహిళలు, ఆయా కుటుంబ సభ్యులు టీడీపీలో చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కనుమూరి లక్ష్మీ, ఉడతా రాఘవ టీడీపీ, జనసేన, బీజేపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోడ్ అమలుకు అధికారుల తాత్సారం

వినుకొండ టౌన్, మే: త్వరలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల కోడ్‌ను పగడ్బందీగా అమలుచేస్తున్నట్లు అధికారులు గొప్పలు చెప్పడం తప్ప ఆచరణలో మాత్రం కనిపించడం లేదు. అధికార పార్టీ స్థానిక ఎమ్మెల్యే తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన నిలువెత్తు కటౌట్‌కు మాత్రం ముసుగులు తొడగడం మరిచిపోయారు. దీంతో లాయర్ స్ట్రీట్‌కు వెళ్లే దారిలో బొల్లా బ్రహ్మనాయుడు కటౌట్ తొలగించకపోవడంతో అధికారుల తీరుపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నేడు హజ్ యాత్రికులకు ఆరోగ్యపరీక్షలు

నరసరావుపేట కల్చరల్, మే 6: పల్నాడు జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు నేడు ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పల్నాడు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని లింగంగుంట్ల ఏరియా ఆసుపత్రిలో ఈ నెల 7వ తేదీన ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు, వాక్సినేషన్ చేయనున్నట్లు ఆయన చెప్పారు. పల్నాడు జిల్లా నుంచి మొత్తం 78 మందికి ఈ వైద్యశిబిరంలో పోలియో, మెదడువాపు, ఇన్‌ఫ్లూయంజా నివారణకు వాక్సిన్ ఇస్తారని ఆయన తెలిపారు. హజ్ యాత్ర చేసే యాత్రికులు ఈ వైద్యశిబిరానికి హాజరై వైద్య పరీక్షలు, వాక్సినేషన్ చేయించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

### ఓటు హక్కుపై అవగాహన

యడ్లపాడు, మే 6: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఓ ఆయుధం అని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టణ, గ్రామీణ ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల ఐక్యవేదిక సంక్షేమ సంఘం నాయకులు మురళి కోరారు. సోమవారం మండల కేంద్రమైన యడ్లపాడులో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ, పట్టణ వైద్యుల ఐక్యవేదిక నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## పోస్టల్ బ్యాలెట్‌లలో అవకతవకలపై సీఈసీకు ఫిర్యాదు

చిలకలూరిపేట, మే 6: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్‌లకు సంబంధించి తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య సోమవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనాను కలిసి ఒక వినతి పత్రంలో ఫిర్యాదు చేశారు. ఈవీఎం బ్యాలెట్ మోడల్స్‌నే పోస్టల్ బ్యాలెట్ పత్రాలుగా వాడారని ఆయన తన వినతిపత్రంలో వివరించారు. ఈ నెల 5వ తేదీన మొత్తం 1,219 ఓట్లు ఈ విధంగా వాడారని పేర్కొన్నారు. ఇది ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయంపై తగిన విచారణ చేసి ఆరోజు పోలైన ఓట్లు అన్నీ చెల్లుబాటు అయ్యేలా చూడాలని ఆయన కోరారు. ఆయన వెంట మీనాను కలిసిన వారిలో తెలుగుదేశం సీనియర్ నాయకులు మన్నవ సుబ్బారావుతో పాటు ఏఎస్ రామకృష్ణ పాల్గొన్నారు. ఢిల్లీలోని ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం అధికారులకు కూడా ఈ ఫిర్యాదును పంపారు.

### వైభవంగా రాజరాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

యడ్లపాడు, మే 6: యడ్లపాడులోని శ్రీగంగా పార్వతీ సమేత శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం సప్తమ వార్షికోత్సవ వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి పంచామృతాలతో అభిషేక పూజలను నిర్వహించారు. కొండకావూరు సీతారాంప్రసాద్ నేతృత్వంలోని వేదపండితులు స్వామివారికి మహారుద్రాభిషేకం, అమ్మవారికి సామూహిక కుంకుమార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల శాంతి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. పుడమి బిల్డర్స్ అధినేత ముత్తవరపు సురేష్‌బాబు దంపతులు శాంతి కల్యాణం సందర్భంగా మంగళసూత్రాలను, పట్టు వస్త్రాలను దేవతామూర్తులకు సమర్పించారు. కార్యక్రమాలను ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఉప్పలపాటి శ్రీనివాసరావు, పోపూరి సోమయ్య, గ్రామపెద్దలు పర్యవేక్షించారు.

## అభివృద్ధి పేరుతో ప్రజలను పక్కదారి పట్టిస్తున్న బొల్లా

**● రూ.6లక్షల బకాయి చెల్లించలేదన్న న్యాయవాదులు**

వినుకొండటౌన్, మే 6: దేవుడు పేరు చెప్పి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజలను పక్కదారి పట్టిస్తున్నారని, పాత కమిటీకి చెల్లించాల్సిన రూ.6 లక్షల బకాయి ఇంతవరకు ఎందుకు చెల్లించలేదని ఘాట్‌రోడ్డు అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్, న్యాయవాది సైదారావు నిలదీశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఘాట్‌రోడ్డుతోపాటు కొండపై దేవాలయం నిర్మిస్తున్నామని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. అమ్మట్రస్టు బాబా ఆదేశాల మేరకు గతంలో పట్టణంలోని కొందరు కమిటీగా ఏర్పడి ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం ప్రజల నుంచి 70లక్షల రూపాయలు వసూలుచేసి కిలోమీటర్ పైబడి ఘాట్‌రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామని, పనుల జరుగుతున్న వైనాన్ని చూసి జీవీ ఆంజనేయులు రూ.7లక్షలు, మాజీ ఎమ్మెల్యే రూ.50 వేలు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జ్ఞానేశ్వరరావు రూ.2.50లక్షలు, పూజారి శ్రీను తండ్రి రూ.లక్ష ఇలా సేకరించిన 70లక్షలతో పనులు ప్రారంభిస్తే బొల్లా బ్రహ్మనాయుడు పాత కమిటీని రద్దుచేసి తన సొంత నిధులతో పనులు ప్రారంభిస్తామని చెప్పారన్నారు. వెంకుపాలెం నుంచి ఉపాధిహామీ పనుల నుంచి ఘాట్‌రోడ్డుకు రూ.3కోట్ల నిధులు విడుదలైనట్లు చెబుతున్నారని, ప్రజల డబ్బులతో పనులు చేసి తాను సొంత నిధులతో పనులు చేస్తున్నట్లు చెప్పడం సమంజసం కాదన్నారు. గతంలో ఘాట్‌రోడ్డు నిర్మాణానికి బ్రహ్మనాయుడు రాసిన చందా లక్ష రూపాయలను పలుమార్లు గుర్తుచేసినా స్పందించలేదని, నాటి నుంచి నేటి వరకు పాత కమిటీ ఊసే లేదని పనులన్నీ తానే చేశామని చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. పాత కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులకు పొక్లయిన్, బ్లాస్టింగ్‌కు ఇవ్వాల్సిన రూ.6లక్షల నేటికి ఆయన చెల్లించలేదని అన్నారు. టిడ్కో ఇళ్ళ పంపిణీలో పేద ప్రజలకు తీరని అన్యాయం చేశారని, చెరువు కట్టలను చక్కదిద్ది ప్రజలకు ఏదో అద్భుతాలు సృష్టించినట్లు చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అనంతరం హై కోర్టు న్యాయవాది కావూరి గోపినాద్ మాట్లడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు 2009 మ్యానిఫెస్టోలో మగధ యూనివర్సిటీలో డిగ్రీ పొందానని, 2014లో కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేసి, 2024లో జరిగే ఎన్నికల్లో తాను నిశానిని అని పొందుపరిచిన అంశంపై ఎందుకు వాస్తవాలను దాస్తున్నారని ఆయన నిలదీశారు.

### అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, మే 6: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆరు సీసాల అక్రమ మద్యాన్ని సోమవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ టీ నయనతార తెలిపారు. ఈ కేసుకు సంబంధించి నిందితుడు ఏనుగుల బజారుకు చెందిన షేక్ సలీంను అరెస్టు చేసినట్టు ఆమె తెలిపారు.

### మద్యం సీసాలు స్వాధీనం... వివరాలు వెల్లడించని అధికారులు

వినుకొండ టౌన్, మే 6: పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న 470 మద్యం సీసాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో మంగళవారం జరిగింది. ఎక్సైజ్ సీఐ జిలాని తెలిపిన వివరాలు పరిశీలిస్తే వినుకొండ నుంచి బొల్లాపల్లి మండలానికి మద్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో సంఘటన ప్రాంతానికి చేరుకొని అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో విధుల్లో ఉన్న ఓ అధికారి ఇచ్చిన సమాచారం మేరకు మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. మద్యం బాటిళ్ళను తరలిస్తున్న వ్యక్తి అధికార పార్టీకి చెందిన వారు కావడంతో కేసు నమోదు విషయంలో తర్జనభర్జనలు పడుతున్నట్లు తెలిసింది.

## నిలిచిన అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తా

**● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు**



టిడ్కో గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, మే 6: చిలకలూరిపేట నియోజకవర్గంలో 2014-19 సంవత్సరాల మధ్య తాను తలపెట్టిన, వైసీపీ అయిదేళ్ల పాలనలో ఆగిపోయిన అభివృద్ధి పనులన్నీ పూర్తిచేస్తామని మాజీమంత్రి, కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అన్నారు. పట్టణ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో చిలకలూరిపేట నియోజకవర్గం పరిధిలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పట్టణంలో పేదలకు కోసం కట్టించిన 4,500 టిడ్కో ఇళ్లు, శంకుస్థాపనలు చేసిన మరో 2వేలఇళ్లు కూటమి ప్రభుత్వం రాగానే అన్ని వసతులతో లబ్ధిదారులకు అందిస్తామన్నారు. జర్నలిస్టులు అందరికీ 2 సెంట్ల ఇంటి స్థలం ఇస్తామని, వైసీపీ ప్రభుత్వం కోతలు పెట్టిన వారందరికీ తిరిగి అక్రిడేషన్లు ఇప్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తానన్నారు. రాబోయే ప్రభుత్వంలో జర్నలిస్టు కాలనీకి 3ఎకరాలు కేటాయించబోతున్నామని, అక్కడే ఐదు సెంట్లలో ప్రెస్ భవన నిర్మాణానికి కూడా స్థలం కేటాయిస్తామని చెప్పారు. చిలకలూరిపేట అభివృద్ధికి సంబంధించి తాను తలపెట్టిన ఇళ్లన్నీ పూర్తయితే 25వేల మంది ఒకేచోట నివసించే అవకాశం ఉందన్నారు. బైపాస్ రోడ్డు కూడా అక్కడే అందుబాటులోకి రాబోతుందని, పట్టణం అటువైపే పెరుగుతోందన్నారు. అక్కడికి రెండులైన్ల రహదారి, పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటును కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. తన హయంలో ఉమ్మడిగుంటూరు జిల్లాలోనే చిలకలూరిపేటకు అత్యధిక మౌలిక వసతుల ప్రాజెక్టులు తెచ్చానని, వాటిని పూర్తి చేసి ఉన్నా వారికే పేరు వచ్చేది అన్నారు. బైపాస్ రోడ్డు పూర్తి చేసి వారి పేరు వేసుకోవచ్చు కదా అని అన్నారు. ఆ బైపాస్, కేంద్రీయ విద్యాలయం, స్పైసెస్ పార్కు అభివృద్ధి, టిడ్కో ఇళ్లు, కొండవీడు కోట అభివృద్ధి, వంద పడకల ఆస్పత్రి, అమృత్ పథకం ఇలా ఏది చూసుకున్నా చిలకలూరిపేటలో తాను చేసిందే కనిపిస్తోందన్నారు. ఎత్తిపోతల పథకాలను పాడుబెట్టారని, మళ్లీ వాటిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. తన హయాంలో మొత్తం 10ప్రాజెక్టులు తెచ్చానని, అవన్నీ పూర్తయితే చిలకలూరిపేటకు ఏ లోటు ఉండదన్నారు. సీఎస్ఆర్ ఫండ్ తీసుకొచ్చి ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ఏర్పాటు చేశానని, రోజుకు 25 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన పథకంలో 25 వేల కుటుంబాలకు లబ్ధి చేకూరేదన్నారు. కేవలం కుప్పం, చిలకలూరిపేటలో మాత్రమే ఈ పథకాన్ని ఏర్పాటు చేశామన్నారు. పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కోరిన తమపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టారన్నారు. ఇక ఆ రోజులకు కాలం చెల్లిందని చిలకలూరిపేటలో రౌడీయిజం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. రౌడీలకు చిలకలూరిపేట ప్రజలు అవకాశం ఇవ్వరని స్పష్టం చేశారు.

### కొంగుపట్టి ఓట్లు అభ్యర్థించి వెంకటకుమారి



కొంగుపట్టి ఓట్లు అభ్యర్థిస్తూ భావోద్వేగానికి గురైన వెంకటకుమారి

చిలకలూరిపేట, మే 6: స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో నారీగళం పేరిట సోమవారం రాత్రి ఏర్పాటు చేసిన మహిళల ఆత్మీయ సమావేశం భావోద్వేగభరితంగా సాగింది. ప్రత్తిపాటికి మద్దతుగా తరలివచ్చిన మహిళల సమక్షంలో కొంగుపట్టి ఓట్లు అభ్యర్థిస్తున్నా అంటూ కన్నీటిపర్యంతమయ్యారు మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి. పాతికేళ్ల ప్రస్థానంలో ప్రతిక్షణం చిలకలూరిపేట ప్రజల కోసమే ఆలోచించిన మంచి మనిషిపై గత ఎన్నికల్లో తప్పుడు ప్రచారాలతో అభాండాలు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నారీగళం సభలో పెద్దసంఖ్యలో మహిళలను చూసిన తర్వాత ఆనందం, బాధ రెండూ కలిగాయని అందుకే కన్నీళ్లు ఆగలేదన్నారు. ప్రత్తిపాటి ఎప్పుడూ పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా పనిచేశారని, మే 13న పోలింగ్ రోజు ఆ ఒక్క విషయం గుర్తుపెట్టుకుంటే చాలన్నారు.

### 8వ వార్డులో వెంకటకుమారి ప్రచారం



అమీన్‌సాహెబ్‌పాలెంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రత్తిపాటి శరత్

చిలకలూరిపేట మే 6: రాష్ట్రంలో పేదలందరికీ త్వరలో ఇళ్లు, ఇంటింటికీ తాగునీటి కల నెరవేరబోతున్నాయని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకటకుమారి ఆదివారం రాత్రి చెప్పారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో ఇంటింటికి తిరిగి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. గతంలోనే చిలకలూరిపేటకు ఆయన 4,500 వరకు టిడ్కో ఇళ్ల నిర్మాణం ప్రారంభించి దాదాపు పూర్తి చేస్తే వాటిని విడదల రజినీ లబ్ధిదారులకు అందకుడా చేశారని విమర్శించారు. వచ్చే అయిదేళ్లలో స్థలాలు లేని పేదలకి పట్టాలు ఇప్పించి, ఇళ్లు కట్టించి ఇవ్వడం ప్రత్తిపాటి పుల్లారావు తొలి ప్రాధాన్యంగా పెట్టుకున్నారని తెలిపారు.

### టిడ్కో గృహస్థుల సమస్యలన్నీ పరిష్కరిస్తా

చిలకలూరిపేట, మే 6 : తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే టిడ్కో గృహాల లబ్ధిదారుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని, పెండింగ్ పనులన్నీ పూర్తిచేసి వారికి సకల వసతులు కల్పిస్తామని మాజీమంత్రి చిలకలూరిపేట కోట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం హామీ ఇచ్చారు. తన హయాంలో 4,500 టిడ్కో ఇళ్లు కడితే, జగన్‌రెడ్డి అబద్ధం చెప్పి ఈ ఇళ్లకు డబ్బు కట్టే పనిలేదని చెప్పి తప్పుదోవ పట్టించారన్నారు. స్థానిక టిడ్కో ఇళ్ల సముదాయంలో నివసిస్తున్న కుటుంబాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను మోసం చేయడం జగన్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని దుయ్యబట్టారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత బ్యాంకులతో మాట్లాడి వాళ్ల టిడ్కో గృహాల లబ్ధిదారుల జోలికి రాకుండా ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. లబ్ధిదారుల్లో ఆ కసి కూడా ఉండాలన్నారు. అలానే టిడ్కో ఇళ్ల సముదాయం పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పోలీస్ పోస్ట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పండరీపురం నుంచి మంచినీటి చెరువు వరకు రెండు లైన్ల రహదారిని వేస్తామన్నారు. రాష్ట్రంలో పేదలు మళ్లీ ఆత్మగౌరవంతో బతకాలంటే, నాసిరకం మద్యం లేకుండా, తాళిబొట్లు భద్రంగా ఉండాలంటే జగన్‌రెడ్డి ప్రభుత్వం పోవాలి, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కూటమి ప్రభుత్వం రావాలన్నారు. వైసీపీ తరపున ఇప్పుడొచ్చిన ఇద్దరిలో ఒకరు గుంటూరు నుంచి, మరొకరు నెల్లూరు నుంచి వచ్చారన్నారు. వాళ్లకు ఓటేస్తే రేపు సమస్యలు ఎక్కడికి వెళ్లి చెప్పుకోవాల్సి ఉంటుందో ఆలోచించాలన్నారు.

### యువత ఆలోచించి ఓటు వేయాలి

నాదెండ్ల, మే 6 : యువత ఆలోచించి ఓటు వేస్తే రాబోయే ఐదు సంవత్సరాలు మళ్ళీ ఆలోచించాల్సిన పని ఉండదని టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు ప్రత్తిపాటి శరత్ అన్నారు. మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో గ్రామంలో సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.



పార్టీలో చేరిన సుగాలీ కాలనీ వాసులతో ప్రత్తిపాటి పుల్లారావు

### రైతులను మోసం చేస్తున్న సీఎం జగన్

చిలకలూరిపేట అర్బన్, మే 6: ఎన్నికల వేళ మరోసారి ఉత్తుత్తి హామీల మేనిఫెస్టోతో ప్రజలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పిలుపు నిచ్చారు. సోమవారం పట్టణంలోని తన నివాసం వద్ద సుగాలీ కాలనీ, ఆది ఆంధ్రా కాలనీకి చెందిన 50 వైసీపీ కుటుంబాలు కొత్త కృష్ణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. యడ్లపాడు మండలం కారసోలకు చెందిన వైసీపీ నాయకులు కారుమూడి బొల్లారెడ్డి, కారుమూడి రవీంద్రారెడ్డి, ఈమని రవీంద్ర, నలజం భీముడు, గోపీ, మల్లు సాయి, రాజనాల శ్రీనివాసరెడ్డి, ఆ పార్టీకి వీడ్కోలు పలికి టీడీపీలో చేరారు. వీరందరికీ కూటమి అభ్యర్థి, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఇవ్వాల్సిన వడ్డీ రాయితీలు రూ 26వేల కోట్లు జగన్ ఎగగొట్టాడని ఆరోపించారు. ఎన్నో గొప్పలు చెప్పుకున్న జగన్ ఈ ఐదు సంవత్సరాల్లో రైతుల సున్నా వడ్డీకి ఇచ్చింది కేవలం రూ.84 కోట్లు అని ప్రత్తిపాటి విమర్శించారు.